




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








విజయవాడ VIJAYAWADA | సంపుటి : 25 Vol.No : 25 | సంచిక : 95 Issue No : 95 | ది. 14-7-2026 Date : 14-7-2026 | మంగళవారం Tuesday | పేజీలు : 8 Pages : 8 | వెల : రూ.1/- Rs.1/-


- 2 ఏళ్లల్లో ఇరిగేషన్ రంగానికి రూ.24 వేలకోట్లు ఖర్చు
- ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు
- డబ్బులిచ్చి మరీ గొడ్డలి పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది
- పవన్ ను అవమానిస్తున్నారు... వాళ్ల కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు
- పిచ్చుకలంకలో రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ధవళేశ్వరం బ్యారేజీకి రూ.153 కోట్లతో 117 కొత్త గేట్ల వపర్పాటు పనులు ప్రారంభించిన ముఖ్యమంత్రి

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత





**కొత్తపేట/ఆత్రేయపురం,జూలై 13 (వార్తాప్రభ) :** గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు,




అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్ట్రన్, సెంట్రల్, వెస్ట్రన్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32 కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117 కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని... కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.

**పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాం..** ఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని సీఎం విమర్శించారు. 2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తిచేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని... అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతోందని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

- ముంబైలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స
- మూడు వారాల పాటు ఫిజియోథెరపీ అవసరమన్న వైద్యులు
- ఆదివారం పవన్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు





**ముంబై,జూలై 13 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను ఫడ్నవీస్ సోమవారం కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## పోలవరం ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు

- పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన సీఎం చంద్రబాబు
- హెలికాప్టర్ నుంచి పనులను విహంగ వీక్షణం ద్వారా వీక్షించిన సీఎం
- స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌ల మధ్య పనులపై ఆరా
- గ్యాప్ 1, గ్యాప్ 2 పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన
- సీఎం వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు



**పోలవరం,జూలై 13 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన హెలికాప్టర్‌లో ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా వీక్షించారు. స్పిల్‌వే నుంచి గోదావరి వరద నీటి ప్రవాహాన్ని, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య జరుగుతున్న పనులను ఆయన విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. అనంతరం, క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆరా తీశారు. ముఖ్యంగా ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం (ఈసీఆర్ఎఫ్)లోని గ్యాప్ 1, గ్యాప్ 2 పనులతో పాటు, నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనుల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఆయన వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఉన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

## బాధిత కుటుంబాల ఆవేదన కలచివేస్తోంది: మంత్రి అచ్చెన్నాయుడు

- గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థిస్తున్నాం
- బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.10 లక్షల చొప్పున అందజేయాలని వైజాగ్ కలెక్టర్‌ను ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి,జూలై 13 (వార్తాప్రభ) :** విశాఖపట్నం తీరంలో గల్లంతైన మత్స్యకార పడవలోని ఆరుగురు మత్స్యకారుల ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలు ప్రస్తుతం అనుభవిస్తున్న వేదన, ఆందోళన, అనిశ్చితి తమను ఎంతగానో కలచివేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆత్మీయుల ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల మనోవేదనను ప్రభుత్వం పూర్తిగా అర్థం చేసుకుందని, ఈ క్లిష్ట సమయంలో వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి తమ కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, వారి సురక్షిత రాక కోసం రాష్ట్ర ప్రజలందరితో కలిసి ప్రార్థిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం భారత కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, విశాఖపట్నం పోర్ట్ అథారిటీతో పాటు ఇతర సంస్థలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్ బాధిత కుటుంబాలను స్వయంగా కలిసి వారికి ధైర్యం చెప్పారని, ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఆరుగురు గల్లంతై 4 రోజులు గడుస్తున్నందున బాధిత కుటుంబాలు అధైర్యపడవద్దని, ప్రభుత్వం వారి వెంటే నిలుస్తుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాల పట్ల ప్రభుత్వం సంపూర్ణ సానుభూతితో ఉందని పేర్కొన్న మంత్రి , వారికి తక్షణ సహాయంగా కమిషనర్ సూచనల మేరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధితులు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం అందజేయాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అభిషేక్ కిషోర్‌ను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలబడటం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, వారి బాధను పూర్తిగా తీర్చలేకపోయినా అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.


### పాస్‌పోర్టు పోయినది

గుంటూరు జిల్లా, మంగళగిరి, తెనాలి ఫ్లైఓవర్ రోడ్డు, కె.కె.టవర్స్, ఫ్లాట్ నెం.302 కాపురస్తుడు వాసిరెడ్డి పాపారావు గారి కుమారుడు వాసిరెడ్డి నాగరాజు అను నా పేరిట విజయవాడలో నెం.టి8773243 గల ఒరిజినల్ పాసుపోర్టు మరియు కొన్ని కాగితములు కలిగి ఉన్నటువంటి ఫైల్‌ను బండికి తగిలించుకొని ది.29-06-2026వ తేదీన మా ఇంటి వద్ద నుండి తాడేపల్లి సెంటర్‌కు వెళ్లుచుండగా మార్గమధ్యంలో జారిపడిపోయినది. వెంటనే పాసుపోర్టు కలిగిన ఫైల్‌ను పరిసర ప్రాంతములో ఎక్కడ వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికిన యెడల నాకు తెలియ పరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 7330633033

### CHANGE OF NAME

I Gundoju Praveen, R/o Hno : 4-34-35, Venkateswaranagar, Medchal dist.Have changed my daughter name from gundoju Dharani (minor 14years) to gundoju deeksha sree.for all purposes


## రాష్ట్రంలో ఆక్వా సంక్షోభం తీవ్రంగా ఉంది

- రొయ్యల రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి...
- చంద్ర బాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య లేఖ



**అమరావతి,జూలై 13 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో తీవ్ర ఆక్వా సంక్షోభం నెలకొని రొయ్యల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, వారిని తక్షణమే ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్వా రైతులను ఆదుకోవాలని కోరుతూ సీఎం కి ఈశ్వరయ్య ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 5 నుంచి 6 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా, లక్షలాది కుటుంబాలు ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే ఇటీవల కాలంలో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, పడిపోతున్న రొయ్యల ధరలు, నాసిరకం సీడ్, కల్తీ మందులు, విద్యుత్ సమస్యలు, ఎగుమతుల్లో ఎదురవుతున్న ఇబ్బందులతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సీపీఐ బృందం పశ్చిమగోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పర్యటించి రొయ్యల రైతులతో మాట్లాడిందని ఈశ్వరయ్య తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే రొయ్యల మేత ధర టన్నుకు రూ.10 వేల నుంచి రూ.12,500 వరకు పెరిగిందని, ముఖ్యమంత్రి సమక్షంలో మేత ధరలను కిలోకు రూ.4 తగ్గించాలని ప్రభుత్వం సూచించినప్పటికీ కంపెనీలు కేవలం రూ.2 మాత్రమే తగ్గించి, ప్రస్తుతం ఆ తగ్గింపును కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. అదేవిధంగా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి 100 కౌంట్ రొయ్యల ధరను కిలోకు రూ.260 నుంచి రూ.235కు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మార్కెట్లో నాణ్యతలేని రొయ్య పిల్లలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, ఒక్క ఎకరానికి లక్ష నుంచి 1.15 లక్షల పిల్లలు వదిలినా అందులో సగం మాత్రమే జీవిస్తున్నాయని పేర్కొన్నారు. నాసిరకం సీడ్ కారణంగా 'వైట్ గట్' (తెల్ల పేగు వ్యాధి) సోకి పంటలు పూర్తిగా నష్టపోతున్నాయని, మరోవైపు ఆక్వా మందుల ధరలు 35 శాతం వరకు పెరిగాయని, కల్తీ మందుల అమ్మకాలను అరికట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమ యంలో ఆక్వా, నాన్-ఆక్వా జోన్లతో సంబంధం లేకుండా యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని ఈశ్వరయ్య గుర్తు చేశారు. పైగా పవర్ ఫ్యాక్టర్ పేరుతో తీసుకొచ్చిన జీవో నంబర్ 169 వల్ల సబ్సిడీ పొందే అర్హత ఉన్న రైతులు కూడా నష్టపోతున్నారని విమర్శించారు. అలాగే అమెరికా ప్రభుత్వం భారత రొయ్యలపై అధిక దిగుమతి సుంకాలు విధించడం వల్ల ఎగుమతులు మందగించాయని, కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ ఒకే కూటమి ప్రభుత్వం ఉన్నప్పటికీ కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి ఆ సుంకాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే రొయ్యల రైతులకు కిలో 100 కౌంట్ రొయ్యలకు రూ.300 మద్దతు ధర ప్రకటించాలని, మేత ధరలను తగ్గించడంతో పాటు అవసరమైతే సబ్సిడీ ఇవ్వాలని, నాసిరకం సీడ్స్ ఉత్పత్తి చేసే హ్యాచరీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విదేశాల నుంచి వచ్చే రొయ్య పిల్లలకు కఠిన నాణ్యత పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే కల్తీ మందుల నియంత్రణ కోసం ప్రత్యేక ఆక్వా మెడిసిన్ పాలసీ తీసుకురావాలని, 'వైట్ గట్' వ్యాధిపై శాస్త్రీయ పరిశోధనలు చేపట్టి సమర్థవంతమైన మందులను రైతులకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఆక్వా రంగానికి సమగ్ర పంట బీమా పథకాన్ని అమలు చేయడంతో పాటు ఇప్పటికే వ్యాధుల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తూ జీవో 169ను రద్దు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ల ధరలను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పడిపోయినప్పుడు రైతులు తమ ఉత్పత్తిని నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని, అమెరికా విధిస్తున్న అధిక దిగుమతి సుంకాలను తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం ద్వారా దౌత్యపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఆక్వా రంగాన్ని కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న గుజ్జుల ఈశ్వరయ్య, అప్పుల భారంతో ఆత్మహత్యల అంచున ఉన్న రొయ్యల రైతులను రక్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని తన లేఖలో డిమాండ్ చేశారు.

# డంపింగ్ యార్డు ఎత్తివేతకై రాజీవ్ గాంధీ నగర్ లో పాదయాత్ర

- టిఆర్ఎస్(జాగృతి), మాజీ కార్పొరేటర్ మేకలలిత యాదవ్ అధ్యక్షతన జరిగిన మూడవరోజు కార్యక్రమం.
-పాల్గొన్న చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్
-బరించలేని దుర్గందాన్ని వెదజల్లుతున్న డంపు యార్డుపై 26 జరిగే సదస్సును జయప్రదం చేయాలని పిలుపు.




**జవహర్ నగర్, జూలై 13:(వార్తా ప్రభ)**బరించలేని దుర్గందాన్ని వెదజల్లే రాంకీ డంపింగ్ యార్డును బేషరతుగా తొలగించాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి డిమాండ్ చేస్తూ 2026, జూలై-13, సోమవారం రోజున కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ, రాజీవ్ గాంధీ నగర్, బాగ్యనగర్ కాలనీ, పాత గబ్బిలాలపేటలో టిఆర్ఎస్ (జాగృతి), మాజీ కార్పొరేటర్ మేక లలిత యాదవ్ అధ్యక్షతన పాదయాత్ర కార్యక్రమం జరిగింది. చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ మాజీ ఉపసర్పంచ్, గౌరవ సలహాదారుడు ఆర్. నర్సింహ్మా గౌడ్, సిపిఐ(ఎం.ఎల్) గడ్డం సదానందం, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, వై.మల్లేష్, ఇప్టూ అరుణ, శివబాబు, టియుసిఐ వి.ప్రవీణ్, దమ్మాయిగూడ ఎత్తరి గణేష్, పిఓడబ్ల్యూ డి.స్వరూప, లక్ష్మీ బాయ్, సిఎంఎస్ జయ, అల్లూరి సావిత్రి, పిఓడబ్ల్యూ (విముక్తి) పెర్క సునీత, పిఓడబ్ల్యూ ఫాతిమా, బి.ఎన్.ఆర్.కె.ఎస్. సూర వెంకటేష్, పిడిఎం చంద్రమౌళి, విజయ్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ టి.కాలేషా, టివిఐవి మబ్బుబాలు, ఎస్.బి.ఎన్.కె.ఎస్. కుమార్, జర్నలిస్ట్ కొన్నెవేణు తదితరులు హాజరై, రాంకీచెత్త డంపింగ్ చెరువులను, కుంటలను, గాలి, నేలను కలుషితం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని, వారి మనుగడను ప్రశ్నార్ధకం చేస్తున్నదని ఎత్తిచూపారు. దీనిపై ప్రజలలో అవగాహన కల్పించెందుకు జూలై-1 నుండి 20 వరకు డంపింగ్ యార్డు ప్రభావిత కీసర, శామీర్ పేట, కాప్రా, యాప్రాల్ మండలాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, జవహర్ నగర్ పలు బస్తీలలో పాదయాత్రలు చేపట్టామని వివరించారు. జూలై-26 న పర్యావరణం, ఆరోగ్య, భద్రత జీవించే హక్కుకై జరిగే సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దుర్గంధం వెదజల్లే రాంకీ చెత్త డంపింగ్ యార్డు తొలగించే వరకు ఉద్యమిద్దామని కొనసాగించాల్సిన అవసరాన్ని వివరించారు.

## న్యూ గాంధీనగర్ కాలనీలో సి.సి. రోడ్డు పనులను ప్రారంభించిన కాలనీ అధ్యక్షులు జి. నరేష్ కుమార్.



**కాప్రా, జూలై 13: (వార్తా ప్రభ)**కాప్రా న్యూ గాంధీనగర్ కాలనీలో సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు కాలనీ అధ్యక్షులు జి. నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా శుభారంభం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు శేషు కొబ్బరికాయ కొట్టి సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు నరేష్ కుమార్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి న్యూ గాంధీనగర్ కాలనీ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు తోటకూర శ్రీకాంత్, పి. రాజు, ఆర్. లక్ష్మీకాంత్, పి. ఆంజనేయులు,పి. మోహన్, మరియు ఇతర కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి కట్టుబడిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం

ఎమ్మెల్యే అరికపూడి గాంధీ




**శేరిలింగంపల్లి,జూలై 13 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి మండల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్పేట్, చందానగర్, భారతి నగర్ (పార్ట్) డివిజన్లకు చెందిన 322 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకం కింద రూ.3,22,37,352 విలువైన ఆర్థిక సహాయాన్ని పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్,మాజీ కార్పొరేటర్లు షేక్ హమీద్ పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ,పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు,మహిళలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీవై పార్టీలో ఘనంగా చేరిన వట్టే మహేందర్ యాదవ్



**రంగారెడ్డి జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన సామాజిక సేవకుడు వట్టే మహేందర్ యాదవ్ , భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ మహేందర్ యాదవ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వట్టే మహేందర్ యాదవ్ మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా తగిన గుర్తింపు, రాజ్యాధికారం కల్పించడమే భారత చైతన్య యువజన పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, రైతులు, యువత, మహిళలు, కార్మికులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి కాలనీకి చేరుకుని ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ప్రజా సంక్షేమం కోసం నిస్వార్థంగా సేవ చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తన బాధ్యతగా భావిస్తున్నానని, పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. తనపై విశ్వాసం ఉంచి పార్టీలో అవకాశం కల్పించిన భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన ప్రతినిధులు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వట్టే మహేందర్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ పాగా వేస్తుంది గడల శ్రీనివాస్

- రాష్ట్రంలో జనసేన పార్టీని అన్ని స్థానాల్లో గెలిపిస్తాం
- కొత్తగడెం పట్టణంలో జనసేన పార్టీ నాయకులు సందడి...
- భారీగా జనసేన పార్టీ లో చేరిక



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం , చుంచుపల్లి మండలం, శ్రీరామ ఫంక్షన్ హాల్ జనసేన పార్టీ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమానికి ముందు జనసేన పార్టీ జిల్లా కార్యాలయంను ప్రారంభించి, పార్టీ జండాను ఆవిష్కరించారు అనంతరం కొత్తగూడెం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టి, అమరవీరుల స్థూపానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ రాం తాళ్ళూరి, జనసేన పార్టీ ఇంచార్జి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి సాగర్, మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు తదితరులు సమక్షంలో 200 మంది యువకులు, మహిళలు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.. ఈ సందర్భంగా మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేను జనసేన పార్టీలోకి రావడం నాకు చాలా ఆనందంగా ఉంది.. నేను ఈ కొత్తగూడెం లోనే పుట్టి పెరిగిన మీ మనిషి ని నేను ప్రజా సేవ చేయడానికి ఈ పార్టీ లో చేరాను.. జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ కు ప్రజలకు ఏమీచేయాలో తెలిసిన నిబద్ధత కలిగిన నాయకుడని, సిద్ధాంతాలు కలిగిన నాయకత్వం లో పని చేసేందుకు ముందుకు వచ్చాను.. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రం లో పెద్ద రాజకీయ శక్తిగా ఎదుగుతుందని నాకు పూర్తి నమ్మకం ఉంది అన్నారు గత ప్రభుత్వం లోని బిఆర్ఎస్ పార్టీ కానీ, ఈ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కానీ ప్రజలకు చేసింది ఏమీ లేదు.. అందుకే ఓ బలమైన రాజకీయ పార్టీగా రానున్న రోజుల్లో మీ సహకారంతో తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేసి .. గెలిచి పైకి ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి ళ్లూరు మాట్లాడుతూ శ్రీరాముడు ఆశీస్సులతో జిల్లాలో సేవ చేసే భాగ్యం కలిగించాలని పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశిస్తే ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గం నుండి పోటీ చేస్తానన్నారు సామాజిక తెలంగాణ జనసేన పార్టీతోనే సాధ్యమని, బీసీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించిన పార్టీకి తాము మొదటగా ఉంటామని, టిఆర్ఎస్ పార్టీ దళిత ముఖ్యమంత్రి వాగ్దానం మాటలుగా మార్చమని, ముఖ్యమంత్రి బీసీ అభ్యర్థి అయినప్పుడే తెలంగాణలో సామాజిక తెలంగాణ వస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి, జనసేన రాష్ట్ర అధ్యక్షులు శంకర్ గౌడ్, రాష్ట్ర నాయకులు రాము యాదవ్,ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, టీ. శ్రీనివాసరావు, సినీనటుడు తనీష్, హసీనా,జయశ్రీ, ఖమ్మం జిల్లా ఇన్చార్జి మిర్యాల రామకృష్ణ,నరేష్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

# సాయి ఎక్సలెంట్ ఆధ్వర్యంలో నవోదయ కోచింగ్

పాఠశాల కరెస్పాండెంట్ కృష్ణ ప్రసాద్



**భద్రాద్రి కొత్తగూడెం జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జూలూరుపాడు, మండల కేంద్రంలో ఉన్న సాయి ఎక్సలెంట్ స్కూల్ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన నవోదయ ఎంట్రెన్స్ పరీక్షకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సాయి ఎక్సలెంట్ పాఠశాల కరెస్పాండెంట్ ఏ . కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా కరెస్పాండంట్ మాట్లాడుతూ 2026-2027 విద్య సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయి ఎక్సలెంట్ స్కూల్లో నవోదయ శిక్షణ ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. గతంలో సాయి ఎక్స్ లెంట్ స్కూల్ శిక్షణ ద్వారా గత విద్యా సంవత్సరంలో నలుగురు విద్యార్థులు నవోదయ సీటు సాధించడం జరిగిందని, ఇంకా సీట్లు సాధించేందుకు అదే స్ఫూర్తితో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను నవోదయ పాఠశాలలకు పంపి ఎన్నో విజయాలు సాధించామని అన్నారు. నవోదయలో ఆరోవ తరగతి పరీక్షల ప్రవేశానికై పరీక్షలో పాల్గొనే విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఆన్లైన్ దరఖాస్తు ఆఖరి తేదీ : 31-07-2026 అని 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. నవోదయ ఎంట్రన్స్ పరీక్ష తేదీ :28-11-2026 న ఉంటుందని తెలిపారు. ది:15-07-2026వ తేదీ నుంచి విద్యార్థులకు సాయి ఎక్స్ లెంట్ స్కూల్లో నవోదయ శిక్షణ క్లాసులు ప్రారంభమవుతున్నట్లు తెలియజేశారు. నవోదయ ఎంట్రెన్స్ పరీక్ష నందు మ్యాథ్స్, మెంటల్ ఎబిలిటీ, తెలుగు / ఇంగ్లీష్ సబ్జెక్ట్ లపై పరీక్ష ఉంటుందని, ఈ సబ్జెక్ట్ లపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించిన వారికి కార్పొరేట్ స్థాయిలో విద్య ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం సాయి ఎక్సలెంట్ స్కూల్ మేనేజ్మెంట్ 9441700094, 9440296832 కు కాల్ చేసి మరిన్ని వివరాలను తెలుసుకోవచ్చు అన్నారు.

# శివచరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేయాలి

శివచరణ్ పై ప్రభుత్వం కేసు నమోదు చేయాలి.
-డిజి.ఏం.పి.ఎస్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ డిమాండ్



**హైదరాబాద్ జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేయాలని, ప్రభుత్వం అతనిపై కేసు నమోదు చేసి శిక్షించాలని, ఈశ్వరమ్మ పై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం యాదగిరిగుట్ట పాలకమండలి సభ్యుల నియామకంలో భాగంగా యాదవ సమాజిక వర్గానికి చెందిన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ గారిని సభ్యురాలుగా నియమించింది. ఈ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో తన ఫోటో లేదనే సాకుతో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఈశ్వరమ్మ పై బహిరంగంగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఒక మహిళపై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేయడంతో తన అగ్రవర్ణ భావజాలాన్ని నిరూపించుకున్నాడు. ఒక పెద్ద వయసు కలిగిన మహిళను అందులో బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళను ఇలా దూషించడం మంచిది కాదన్నారు. ఈ సంస్కృతి రాజకీయాలలో సరైన పద్ధతి కాదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మరియు ప్రభుత్వం తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో ప్రభుత్వం ఒకవైపు బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని పేర్కొం టూ, మరోవైపు ఇలాంటి నాయకులచే అనుచిత వ్యాఖ్యలు చేసేలా ప్రేరేపిం చినట్టు అనుకోవాల్సి వస్తుందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక వర్గాల మధ్య గొడవలు సృష్టించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. శివ చరణ్ రెడ్డి ఈశ్వరమ్మకు తక్షణమే క్షమా పణలు చెప్పాలని డిమాండ్ చేశారు .ప్రభుత్వం చర్యలు తీసుకోని ఎడల బీసీ, యాదవ, మరియు మహిళా సంఘాలను కలుపుకొని ఉద్యమం చేస్తామని రవిందర్ హెచ్చరించారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి..

**ఆసిఫాబాద్, జూలై 13(నేటి మనదేశమ్ (ప్రతినిధి)::**ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలనిమండల ఇంచార్జి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ ఆన్నారు. సోమవారం రెబ్బెన, గోలేటి గ్రామంలో పర్యటించి బూత్ లెవెల్ అధికారులు , బి.ఎల్.ఏ లు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉదయ్ కుమార్, జిపిఓ మహేందర్, అంగన్వాడి కార్యకర్తలు భాగ్యలక్ష్మి, పులవతి, రుక్మిణి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కిషన్ గౌడ్, మాజీ యంపిటిసి సురేందర్ రాజు, నాయకులు దుర్గం రవీందర్, చెన్న సోమశేఖర్, అన్నం రమేష్, లింగంపల్లి ప్రభాకర్, జాడి కిషోర్, క్రాంతి,పస్తం రాజు,సంఘం శంకర్, జటాంగుల సంజయ్, కటకం రవి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## తిరుమల వెంకన్న ను దర్శించుకున్న బాబా బాగేశ్వర్




**హైదరాబాద్ : జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బాబా బాగేశ్వర్ శ్రీ ధీరేంద్ర శాస్త్రి గారు తిరుపతిలో మూడు రోజుల ఇంధన సంరక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శ్రీ బాలాజీ దర్శనం కోసం, శ్రీ ధీరేంద్ర శాస్త్రి తన సహచరులతో కలిసి జులై 10వ తేదీన రాత్రి బస కోసం తిరుమలలోని తిరుపతి దేవస్థానంలో ఉన్న శ్రీ జగదీష్ నారాయణి అతిథి గృహం (అగ్రసేన్) తిరుమలకు వచ్చి, జూలై 11వ తేదీన శ్రీ బాలాజీ భగవాన్‌ను సుప్రభాత దర్శనం చేసుకున్నారు. శ్రీ ధీరేంద్ర శాస్త్రి జీతో పాటు ఓం ప్రకాష్ బన్సల్, అంజనీ కుమార్ అగర్వాల్, అశుతోష్ బన్సల్, మనీష్ అగర్వాల్, మున్నా లాల్ అగర్వాల్ కూడా శ్రీ తిరుపతి బాలాజీ భగవాన్ యొక్క సుప్రభాత దర్శన ప్రయోజనాన్ని పొందారు. ఈ సందర్భంగా భాగ్యనగర సోదరులు శ్రీ ధీరేంద్ర శాస్త్రి గారిని సత్కరించారు. జూలై 17వ తేదీ నుండి 19వ తేదీ వరకు భాగ్యనగర్‌లో శ్రీ ధీరేన్ శాస్త్రి హనుమాన్ కథను చెప్పనున్నారనే విషయం గమనార్హం. ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి, మరియు హనుమాన్ కథను ఆస్వాదించి, ఆ దివ్య సభ నుండి ప్రయోజనం పొందడానికి భాగ్యనగర్ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని శ్రీ ధీరేన్ శాస్త్రి విజ్ఞప్తి చేశారు. భాగ్యనగర్‌కు చెందిన ఓం ప్రకాష్‌జీ బన్సాల్, అశుతోష్ బన్సల్, అంజనీ కుమార్ అగర్వాల్, మనీష్ అగర్వాల్, మున్నాలాల్ అగర్వాల్ బాబాతో పాటు ఆయన సహచరులతో పాటు శ్రీ జగదీష్ నారాయణి అతిథి గృహం (అగ్రసేన్) తిరుమలలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజాతీర్పు తాకట్టు పెట్టి, ప్రజా సంక్షేమాన్ని మరచిన ఎమ్మెల్యే గాంధీ

-మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి తీవ్ర ఆరోపణ




**శేరిలింగంపల్లి,జూలై 13 (వార్తాప్రభ):**బీఆర్ఎస్ బీఫామ్‌తో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి రెండేళ్లు పూర్తైన సందర్భంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం శేరిలింగంపల్లిలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి మాట్లాడుతూ,శేరిలింగంపల్లి ప్రజా తీర్పును కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టారని ఆరోపించారు. ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసిన ఎమ్మెల్యే రాజీనామా చేసి మళ్లీ ప్రజా తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు పొట్ట నరేందర్ యాదవ్, విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను విస్మరించి వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. శేరిలింగంపల్లి ప్రజలు తగిన సమయంలో సరైన తీర్పు ఇస్తారని హెచ్చరించారు. ఈ నిరసనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణికి అందిన 66 ఫిర్యాదులు




**శేరిలింగంపల్లి,జూలై 13 (వార్తాప్రభ):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 66 ఫిర్యాదులు అందాయి. వీటిలో టౌన్ ప్లానింగ్‌కు 51, ఇంజినీరింగ్‌కు 8, శానిటేషన్‌కు 2, అర్బన్ బయోడైవర్సిటీకి 2, ఎలక్ట్రికల్, రెవెన్యూ (ప్రాపర్టీ ట్యాక్స్), ఎన్నికల విభాగాలకు ఒక్కో ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కమిషనర్ ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి,ప్రతి ఫిర్యాదును త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్ కేటాయించి,పరిష్కార ప్రక్రియను ప్రజలు ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

# సంపాదకీయం

## బీజేపీని వేడెక్కిస్తున్న బాంకీపూర్ బై పోల్ !

బీహార్ లో ఒక అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక. అయితే ఇపుడు ఆ ఉప ఎన్నిక ఏకంగా జాతీయ స్థాయిలోనే ఆకట్టుకునేలా మారుతోంది. దాని పేరు బాంకీపూర్ ఇక్కడ ఉప ఎన్నిక వచ్చిపడింది. దానికి కారణం ఈ సీటు నుంచి గెలిచి ఎమ్మెల్యే అయిన నితిన్ నబీన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు అయ్యారు. 2025 చివరిలో బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. ఇక నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా మొదట్లో బాధ్యతలు చేపట్టినా ఈ ఏడాది ఏప్రిల్ లో రాజ్యసభకు వెళ్ళి ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేశారు. దాంతో పాటు బాంకీపూర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి నితిన్ నబీన్ బీజేపీ పగ్గాలు అందుకున్నారు. దీంతో ఈ రెండూ కూడా ఈ సీటు ఉప ఎన్నిక మీద తీవ్రంగా ప్రభావం చూపనున్నాయి. ఇదిలా ఉంటే బీజేపీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పార్టీ ఎంపిక చేసిన ఒక అభ్యర్థి తన నామినేషన్ ని అట్టహాసంగా వేసి మరీ మరుసటి రోజు తాను పోటీకి దూరం అని తప్పుకోవడం. ఆ అభ్యర్ధి అభిషేక్ కుమార్ సిన్హా. ఆయన నామినేషన్ దాఖలు కి బీహార్ సీఎం సామ్రాట్ చౌదరి కూడా హాజరయ్యారు. అయితే కేవలం ఇరవై నాలుగు గంటల వ్యవధిలోనే ఆయన తప్పుకోవడానికి కారణం ఏంటి అంటే ఆయన కుటుంబం మీద పశు గ్రాసం కుంభకోణం కేసు ఉందని అంటున్నారు. ఈ కేసులోనే మాజీ సీఎం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన పదవిని కోల్పోయి కోర్టుల చుట్టూ ఏళ్ళ తరబడి తిరిగారు. బీజేపీ అభ్యర్థికి లింక్ ఏంటి అంటే అభిషేక్ కుమార్ సిన్హా తల్లిదండ్రులు గతంలో ఈ కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టులో దోషులుగా తేలారు అని అంటున్నారు. దాంతో ఇదే అంశం ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతోందని గ్రహించిన బీజేపీ తమ అభ్యర్థి చేత పోటీ నుంచి విరమించుకుంటున్నట్లుగా ప్రకటింపచేసింది అని అంటున్నారు. ఇక ఇది జరిగిన వేంటనే నీరజ్ కుమార్ సిన్హా అనే అభ్యర్థిని బీజేపీ రంగంలోకి దించింది. అయితే దీని మీద విపక్షాల నుంచి విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా జన సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ అయితే ఇదే విషయం మీద గట్టిగానే మాట్లాడుతున్నారు. ఇతర పార్టీలను ఈడీ సీబీఐలతో బెదిరించే బీజేపీకి ఇపుడు తన సొంత పార్టీ అభ్యర్థి విషయంలో ఇదే పరిస్థితి ఎదురైంది అని సెటైర్లు వేశారు. అందుకే బీజేపీ అభ్యర్థి మొదటి పోరాటంలోనే పోటీ నుంచి తప్పుకుని పారిపోయారని ఎద్దేవా చేశారు. బీజేపీ అవినీతి పరులకు టికెట్లు ఇస్తుంది అనడానికి ఇదే ఉదాహరణ అని ప్రశాంత్ కిశోర్ విమర్శలు గుప్పించారు. ఇక బాంకీపూర్ అసెంబ్లీ సీటు ఇపుడు గట్టి పోటీగా మారింది. ఇక్కడ నుంచి బీజేపీ అభ్యర్థి నామినేషన్ వేసి తప్పుకోవడం రాజకీయ రచ్చగా మారింది. పైగా ఆయన జాతీయ అధ్యక్షుడు నిన్నటి ఎమ్మెల్యే నితిన్ నబీన్ కి అత్యంత సన్నిహితుడు. ఇపుడు కొత్త అభ్యర్థి ఏ మేరకు నెగ్గుకుని రాగలరు అన్నది కూడా చర్చగా ఉంది. మరో వైపు చూస్తే ఆర్జేడీ నుంచి రేఖా గుప్తా పోటీలో ఉన్నారు. జన సురాజ్ నుంచి ప్రశాంత్ కిశోర్ బరిలో ఉన్నారు. 1995 నుంచి బీజేపీ ఇక్కడ ఓటమి లేకుండా గెలుస్తూ వస్తోంది. నితిన్ నబీన్ తండ్రి నవీన్ కిశోర్ సిన్హా తొలిసారి గెలిచారు. ఆయన 2006 దాకా ఇక్కడ ప్రాతినిధ్యం వహించారు. ఆ మీదట నితిన్ నబీన్ ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్నారు. ఇపుడు ఈ సీటుని నిలబెట్టుకోవడం బీజేపీకి అత్యంత ప్రతిష్టగా మారుతోంది. ఇక బీహార్ లో నితీష్ కుమార్ సీఎం గా లేరు, బీజేపీ సీఎం గా ఉన్న సామ్రాట్ చౌదరికి ఇది తొలి అగ్ని పరీక్షంగా చెబుతున్నారు. ఈ సీటులో బీజేపీ ఇబ్బంది పడి గెలిచినా కూడా అది పార్టీకి దెబ్బే అని అంటున్నారు. భారీ మెజారిటీతో గెలవాలి. ఎందుకంటే సార్వత్రిక ఎన్నికలు జరిగి ఏడాది కూడా కాలేదు కాబట్టి. మరి ఈ నెల 30న జరిగే ఈ ఎన్నికల ఫలితం ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది.

## మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ అందజేత



**విజయవాడ పశ్చిమ జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎం ఎల్ ఏ సుజనా చౌదరి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిది నుంచి మంజూరైన ఎల్ ఓ సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను కూటమి నేతలు ఎన్డీయే కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. 38 వ డివిజన్, రావి చెట్టు సెంటర్ కు చెందిన కే నాగేశ్వరరావు (44) హృద్రోగంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు అతనికి మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 6 లక్షల 50 వేల విలువైన ఎల్ ఓ సీ ను కూటమి నేతలు తమ్మిన లీల కరుణాకర్, బెన్నా భక్తుల సోమేశ్వరరావు, అల్లంకి శ్రీనివాస్ ఎన్డీయే కార్యాలయంలో అందజేశారు ... త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేసిన ఎం ఎల్ ఏ సుజన చౌదరి కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..

## పంచాయతీ కార్యాలయం లో బి.ఎల్. వో. ల తో సమీక్షా సమావేశం



**పెనుగంచిప్రోలు, జూలై 13( వార్త ప్రభ )** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రోగ్రామ్ పురోగతి గురించి మండల ప్రత్యేక అధికారి, మరియు లీగల్ మెట్రాలజీ ఆఫీసర్ , సాయిరాం, సోమవారం పెనుగంచిప్రోలు పంచాయతీ కార్యాలయం లో బి ఎల్ వో లతో సమీక్షా సమావేశం నిర్వహించిన్నారు , ఓటర్లు ఎన్యూమరేషన్ ఫోమ్స్ పంపిణీ మరియు వాటి సేకరణ డిజిటలైజేషన్ వివరాలు మండలం లోని బి ఎల్ వో ల వారిగా రివ్యూ చేయడమైనది ఈ ప్రోగ్రామ్ లో మండల తహసీల్దార్ శ్రీమతి కల్యాణి మరియు ఎంపిడిఓ జీ.శ్రీను పాల్గొన్నారు....

## భారతీయ సంస్కృతీ పరిరక్షకుడు దీనదయాళ్: రమేష్ శ్రీకొండ



**విజయవాడ పశ్చిమ జూలై 13: (వార్తా ప్రభ ప్రతినిధి)**భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత, కుటుంబ విలువలు, సామాజిక సామరస్య పరిరక్షణకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ శ్రీకొండ పేర్కొన్నారు. ప్రముఖ రచయిత డాక్టర్ నితిన్ ఖర్చే మరాఠీలో రచించిన "పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ -- వ్యక్తిత్వం విభిన్న కోణాలు" తెలుగు అనువాద గ్రంథ ఆవిష్కరణ ఆదివారం విజయవాడ కేబీఎన్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా రమేష్ శ్రీకొండ మాట్లాడుతూ, దీనదయాళ్ ప్రతిపాదించిన 'ఏకాత్మ మానవవాదం' భారతీయ తాత్త్విక దృక్పథానికి ఆధునిక రూపమని చెప్పారు. సమాజంలోని చివరి వ్యక్తి సంక్షేమమే నిజమైన అభివృద్ధిగా ఆయన భావించారని, అట్టడుగు వర్గాల అభ్యున్నతిని ప్రభుత్వ విధానాల కేంద్రంగా ఉంచాలని సూచించారని తెలిపారు. మూలగ్రంథ రచయిత డాక్టర్ నితిన్ ఖర్చే మాట్లాడుతూ, సనాతన భారతీయ వ్యవస్థకు కుటుంబమే మూలధారమని, దీనదయాళ్ ఉపాధ్యాయ అధికార పదవులు, ఆడంబరాలకు దూరంగా ఉండి ప్రజాసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని అన్నారు. తెలుగు అనువాదకుడు, ఇగ్నో మాజీ సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ డి.ఆర్. శర్మ మాట్లాడుతూ, ఈ గ్రంథం ఇప్పటికే 13 భారతీయ భాషల్లోకి అనువదించబడిందని, తెలుగు అనువాదం చేయడం తనకు గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కేబీఎన్ కళాశాల తెలుగు విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ చలపతిరావు అధ్యక్షత వహించారు.

## ప్రజల సమస్యలపై శాఖాధిపతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**




**విజయవాడ పశ్చిమ జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు. ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కమిషనర్, గతంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని శాఖాధిపతులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ సేవల కోసం రూపొందించిన "పురమిత్ర" యాప్లో నమోదవుతున్న ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఒక శాఖ నుండి మరో శాఖకు మళ్లించడం కాకుండా, సంబంధిత అధికారులు స్వయంగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కమిషనర్ స్పష్టం చేశారు. శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 19 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు 9, రోడ్ల ఆక్రమణలు వంటి అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు నమోదు కాగా, పబ్లిక్ హెల్త్ 2, ఇంజనీరింగ్ 5, పిఓ యుసిడి 2, రెవెన్యూ 1 ఫిర్యాదులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా పరిశీలించి, ప్రజలకు స్పష్టమైన మరియు శాశ్వత పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఏ. రవీంద్రరావు, డాక్టర్ డి. చంద్రశేఖర్, కె. శకుంతల, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, పర్యవేక్షణ ఇంజనీర్లు చంద్రశేఖర్, కె. దుష్యంత, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 15 న డిస్కం కార్యాలయం వద్ద ధర్నా



**విజయవాడ పశ్చిమ జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఏపీసీపీడీసీఎల్ డిస్కం కార్యాలయం ముందు జూలై 15 న ధర్నాను జయప్రదం చేయాలని సోమవారం మండలంలోని నున్న సెక్షన్ లో ప్రచారం నిర్వహించారు. విద్యుత్ సంస్థ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సమస్యలు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సి.ఐ.టి.యు.) రీజనల్ కార్యదర్శి పి.అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పీస్ రేట్ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు చెల్లించాలి.. 2019 - 2020 మధ్యలో చేరిన కార్మికులకు పాత ఆపరేటర్లతో సమానంగా వేతనం చెల్లించాలి.. ఉద్యోగులకు వెంటనే మెరుగైన ఫిట్మెంట్ తో పి.ఆర్.సి. ప్రకటించి అమలు చేయాలి.. డి.ఎ.లు వెంటనే విడుదల చేయాలి.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చెయ్యాలి, జె ఎల్ ఎం కన్వర్షన్స్ కార్మికులందరికీ ఎ ఎల్ ఎం ప్రమోషన్లివ్వాలి.. 2008 ముందు చేరిన ఉద్యోగులందరికీ ఇ.పి.ఎఫ్. హయ్యర్ పెన్షన్ అమలుకు తగిన చర్యలు తీసుకోవాలి.. సంస్థలో గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి.. విద్యుత్ సంస్థలో ప్రైవేటీకరణ విధానాలు ఆపాలి.. వినియోగదారులకు ఇరవై నాలుగు గంటలూ సేవలందిస్తూ ప్రమాదకర పరిస్థితుల్లో సైతం పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం వీడి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జి.వి.రంగారెడ్డి, గుంటక చిన వెంకటరెడ్డి, విద్యుత్ కార్మికులు ఎన్.అర్జున్, బి.రంగస్వామి, వహీద్ ఖాన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరూ వెంటనే ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

**సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ పిలుపు**



**విజయవాడ పశ్చిమ జులై 13: (వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ ఐ ఆర్- 2026) ప్రక్రియ ముగింపు దశకు చేరుకుందని, అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు మరియు డిజిటలైజేషన్ దరఖాస్తులను సమర్పించడానికి జూలై 14 (మంగళవారం) ఆఖరి తేదీ అని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈ గడువును మరికాస్త పొడిగించే ప్రసక్తే లేదని, జూలై 14 అర్ధరాత్రి 12 గంటలకు ఆన్లైన్ పోర్టల్ పూర్తిగా క్లోజ్ చేయబడుతుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మీ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు ( బి ఎల్ ఓ) ఇంటింటికీ వచ్చినప్పుడు మీ వివరాలను సరిచూసుకోవచ్చనీ తెలిపారు. లేదా ఈ సి ఐ ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా కానీ, మొబైల్ యాప్ ద్వారా కానీ ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూలై 21న ఓటర్ల ముసాయిదా విడుదలవుతుందని వివరించారు. కావున చివరి నిమిషం వరకు వేచి చూడకుండా, సాంకేతిక ఇబ్బందులు తలెత్తక ముందే అర్హులైన ప్రజలు, యువత వెంటనే తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆకుల శ్రీనివాస్ కోరారు.

## చిట్టినగర్‌లో సాయిబాబా సత్సంగం సేవా సమితి ఆధ్వర్యంలో 7,000 మంది విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ



**విజయవాడ పశ్చిమ జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**చిట్టినగర్ శ్రీ నగరాల సీతారామస్వామి--మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం కళ్యాణ మండపంలో సాయిబాబా సత్సంగం సేవా సమితి నిర్వాహకులు మేకా కృష్ణశేఖర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 7,000 మంది విద్యార్థులకు ప్రముఖ దాత వడ్డీ సురేష్ ఉచితంగా పుస్తకాలను అందజేశారు. సాయిబాబా సత్సంగం సేవా సమితి ప్రతి నెల నాలుగు ఆదివారాల్లో ఒక ఆదివారం పేదలకు నిత్యావసర సరుకులు, ఉచిత భోజనం అందించడం, మూగజీవాలకు అవసరమైన వైద్యసేవలు, చికిత్సలు అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని నిర్వాహకులు తెలిపారు. అలాగే సాయిబాబా బోధనలను భక్తులకు సత్సంగాల ద్వారా వివరిస్తూ, ఆధ్యాత్మికతతో కూడిన సేవా మార్గంలో ప్రజలను నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మేకా కృష్ణశేఖర్ అందిస్తున్న సేవలు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. విద్యార్థులు మంచి నడవడి అలవరచుకోవడంతో పాటు తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిళ్ళా శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, విద్యార్థులు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం ద్వారా ఉన్నత వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పుస్తకాలను అందించిన దాత వడ్డీ సురేష్ సేవాభావాన్ని అభినందిస్తూ, ఆయనకు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కార్యక్రమానికి హాజరైన వారు ఆకాంక్షించారు.

## అన్నదాత సుఖీభవ..కొనియాడుతున్న అన్నార్తులు

**కళ్ళే లలిత వీధిలో 55నెలలు నుండి ప్రతి నెల అన్నసమారాధన.**



**విజయవాడ పశ్చిమ జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి** పేద ప్రజలకు, అన్నార్తులకు ప్రతి నెల అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్వర్గీయ కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సింగ్ నగర్ కళ్ళే లలిత వీధిలో గత 56నెలలు నుండి ప్రతి నెల అన్నసమారాధన కార్యక్రమం కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు పాల్గొని స్వర్గీయ కళ్ళే లలిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు,అన్నార్తులకు అన్నదానం నిర్వహించారు. సింగ్ నగర్ ప్రాంతంలో స్వర్గీయ కళ్ళే లలిత జ్ఞాపకార్థం, కళ్ళే లలిత వీధిలో ప్రతి నెల అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,ట్రస్ట్ డైరెక్టర్లు సేవలు ఎనలేనిదని అన్నారు. స్వర్గీయ కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెల 12వ తేదిన క్రమం తప్పకుండా గత 55నెలలు నుండి పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కళ్ళే లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. తమకు కలిగిన ఆర్థిక స్థోమత బట్టి పేదలకు ఆహారాన్ని అందజేయడం జరుగుతుందని అన్నారు. కళ్ళే లలిత బ్రతికి ఉన్న రోజులలో పేదల ఆకలి తీర్చాలని తెలపడం జరిగిందని అందుకే ప్రతి నెల వారికి భోజనాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. రానున్న రోజులలో కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు ద్వారా పేదలకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మిముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్,జి. ధ్రువన్,చందన సురేష్,ప్రసాద్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విజయవాడలో శారదా కళా సమితి 47వ వార్షికోత్సవం




**విజయవాడ పశ్చిమ జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి )**శారదా కళా సమితి 47వ వార్షికోత్సవం విజయవాడలో నిర్వహిస్తున్నట్లు శారదా కళా సమితి నిర్వాహకులు దోగుపర్తి శంకర్రావు, వి వి కే నరసింహారావు తెలిపారు, బ్రాహ్మణ వీధి కన్యక పరమేశ్వరి సత్రంలో జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారదా కళా సమితి 46 సంవత్సరాలు పూర్తి చేసుకుని 47 వ సంవత్సరంలోకి పెడుతున్న సందర్భంగా జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు, ఈ జనరల్ బాడీ మీటింగ్ లో 47వ వార్షికోత్సవానికి సినీ యాక్టర్ ఆలిని పిలిచి ఘనంగా సత్కరించుకోవాలని ఆలోచనతో ఈ సంవత్సరం ఉన్నామని ఈ కార్యక్రమానికి ఆలీ ఇచ్చిన డేట్ లో ఈ వార్షికోత్సవం త్వరలో నిర్వహిస్తామని తెలిపారు, ప్రతి సంవత్సరం సినీ రంగా కళామ్మతల్లి ప్రముఖులను ఒక సంవత్సరం ఒకర్ని చొప్పున సత్కరిస్తున్నామని తెలిపారు, ఈ జనరల్ బాడీ మీటింగ్ లో భాగంగా తొలత ప్రముఖ గాయని ఎస్ జానకి మృతి పట్ల సంతాపాన్ని నిర్వహించారు, ఈ జనరల్ బాడీ మీటింగ్ లో శారదా కళ సమితి సభ్యులు ఎం ఆర్ ఎస్ ప్రకాష్ రావు, కె.వి. రామ్మోహన్ రావు, బొలిశెట్టి జగన్మోహన్ గుప్తా, శేగు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు

## శ్రీ విజయ దుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో నందీశ్వర స్వామి కి అభిషేకాలు





**విజయవాడ పశ్చిమ జులై 13:(వార్తా ప్రభ ప్రతినిధి).**శ్రీ విజయ దుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో నందీశ్వర స్వామి వారికి పరాభవ నామ సంవత్సర నిజ జేష్ఠ మాసం బహుళ త్రయోదశి ప్రదో:షకాలంలో పంచామృత అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి, సహ అర్చకులు చింతలపాటి నాగ వెంకట పవన్ కుమార్ శర్మ లు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్వామివారికి పంచామృతాలు వివిధ రకాల పండ్ల రసాలతో విభూది వంటి వాటితో అభిషేకాలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందీశ్వర స్వామి వారికి ఈ అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు, రేపు ఆరుద్ర నక్షత్రం తో కూడిన సోమవారం సాయంత్రం ప్రదో:షకాలంలో మాస శివరాత్రి పురస్కరించుకొని స్వామివారికి పంచామృత అభిషేకం, తదనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు ఆలయ కమిటీ వారి పరివేక్షణలో జరుగునని అన్నారు, ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారి కృప కటాక్షాలను తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఈ సందర్భంగా తెలిపారు.

## త్యాగానికి ప్రతీకలు పూవులు



కొమ్మలోని పూవులు
ఎన్నెన్నో సొగసులు
పరహితమే కోరుతూ
వెదజల్లును తావులు
మెత్తనైన సుమములు
అమ్మల్లా
ఒటి మనసులు
ఉండదోయి!
స్వార్ధము
నిలువెల్లా త్యాగము
త్యాగానికి ప్రతీకలు
అసమానం సేవలు
పరహితమే అమితము
సుగుణాలు అమోఘము
రకరకాల పూవులు
ముందడుగు సేవలో
అల్లితే మాలికలు
అలరించను కంఠంలో

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# సాహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

**ఆత్మకూరు జులై 13 (వార్తాప్రభ)** విద్యార్థుల విద్యాభివృద్ధి,సంక్షేమం లక్ష్యంగా సాహో ఫౌండేషన్ మర్రిపాడు వారి ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మరియు ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరూ లేని విద్యార్థులలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన టాప్ టెన్ విద్యార్థులలో మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి రూ.10,000 చొప్పున మిగిలిన ఏడు మంది విద్యార్థులకు రూ.5,000 చొప్పున నగదు బహుమతులు అందించారు. అలాగే ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులలో మొదటి రెండు స్థానాలు సాధించిన వారికి రూ.10,000 చొప్పున,మిగిలిన మూడు స్థానాలు సాధించిన వారికి రూ.5,000 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు.ఇదే కార్యక్రమంలో రోటరీ క్లబ్ సైబరాబాద్ వారి సౌజన్యంతో బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు.ఈ సందర్భంగా సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు



నిష్‌బిట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత పడచల నాగేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని కుటుంబాలలో తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరినీ కోల్పోవడం వల్ల విద్యార్థుల జీవితాల్లో నిర్లిప్తత ఆత్మ విశ్వాసం లోపించే అవకాశముందని అలాంటి విద్యార్థులకు అండగా నిలిచి వారి విద్యాభివృద్ధికి తోడ్పడటమే సాహో ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన ఆత్మకూరు డివిజనల్ విద్యాశాఖాధికారి జానకిరామ్ మాట్లాడుతూ మర్రిపాడు మండలంలో విద్యార్థుల సంక్షేమం కోసం సాహో ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఘనంగా కొనియాడారు.రాబోయే రోజుల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు తిరుపతయ్య ధనలక్ష్మి చిలకపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మారుతి కేశవరెడ్డి బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసులు పొంగూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు కేజీబీవీ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి జొన్న సత్యనారాయణ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పడచల రామయ్య,సాహో ఫౌండేషన్ సభ్యులు కర్యావుల రమణయ్య పడచల నాగేశ్వరరావు సతీమణి సునీత వారి తల్లి సుబ్బమ్మ దయాకర్ రెడ్డి రవి కుమార్ మార్గదర్శి ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అమలుకు నోచుకోని జర్నలిస్టుల సంక్షేమ హామీలు

**నిరసనగా టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా**



**జవహర్ నగర్, జూలై 13:(వార్తా ప్రభ)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నిర్దిష్టంగా అమలుచేయాలని మీడియా స్వేచ్ఛ కాపాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ( టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాపిత పిలుపులో బాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని భారీగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి ప్రసాద్,జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్,మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అంబాల విష్ణు,జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అర్హులైన వారందరికీ వెంటనే అక్రిడేషన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు, పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయతీలు ఇండ్ల స్థలాల హామీలు అమలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేందంటే ఆందోళ తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా, నియోజక వర్గం ఇంచార్జ్ లు నాయకులు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## యాదవ యువత ఐక్యతే సమాజాభివృద్ధికి బాట: శంకర్ యాదవ్





**తిరుపతి, జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అఖిల భారతీయ యాదవ మహాసభ తిరుపతి జిల్లా యువజన సమన్వయ సమావేశం ఆదివారం తిరుపతిలోని కపిలతీర్థం సమీపంలో ఉన్న రాష్ట్ర యాదవ యువజన అధ్యక్షుడు శంకర్ యాదవ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర యాదవ యువజన అధ్యక్షుడు శంకర్ యాదవ్ అధ్యక్షత వహించగా, తిరుపతి జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు నందకుమార్ యాదవ్‌తో పాటు జిల్లాలోని సుమారు 30 మంది మండల యువజన అధ్యక్షులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర యాదవ యువజన అధ్యక్షుడు శంకర్ యాదవ్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవ యువత చురుకైన పాత్ర పోషించి సమాజానికి బలమైన నాయకత్వాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామస్థాయిలో యువ నాయకులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో యాదవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఐక్యతతో పాటు సంఘటిత కార్యాచరణ అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంస్థను మరింత బలోపేతం చేయడం, యువతలో సామాజిక చైతన్యం పెంపొందించడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై సవివరంగా చర్చించారు.అలాగే సమాజ అభ్యున్నతికి విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు.చివరిగా యాదవ సమాజం అభివృద్ధి, యువత సాధికారత, సామాజిక ఐక్యత సాధనే లక్ష్యంగా ప్రతి యువ నాయకుడు సమిష్టిగా పనిచేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

## ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

**12 వ పి ఆర్ సి 30% ఐ .ఆర్, ఆర్థిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి - బిటీఏ**



**మర్రిపాడు జూలై 13 (వార్తాప్రభ)** జిల్లాలోని మర్రిపాడు మండల పరిధిలోని పోలిరెడ్డిపల్లి నందవరం మర్రిపాడు క్లస్టర్ పరిధిలోని అన్ని పాఠశాలలో బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఏ) సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మణి సుబ్బు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉపాధ్యాయ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పిఆర్సీ డిఏ బకాయిల ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాస ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రభుత్వం పై ధ్వజమెత్తారు.సమస్యల పరిష్కారం కోసం నెల్లూరు లో రేపు కలెక్టరేట్ వద్ద జరుగు నిరసన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా ట్రెజరర్ రాజశేఖర్ మాట్లాడుతూ పిఆర్సీ గడువు ముగిసి రెండున్నర సంవత్సరాలు అయిన ఇంతవరకు కమీషన్ కూడా వేయకపోవడం పెండింగ్‌లో ఉన్న మూడు డిఏ లు విడుదల చేయలేదని,మూడు సంవత్సరాల క్రితం పెట్టుకున్న సరెండర్ లీవులు క్రెడిట్ కాకపోవడం శోచనీయం అని అన్నారు.మండల అధ్యక్షులు ఈ శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఏడాది బదిలీయై ఇప్పటికీ రిలీవ్ కాకుండా ఉన్న ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు.మండల ప్రధాన కార్యదర్శి ఎం.పి నరసింహులు మాట్లాడుతూ ఆదరిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందంటూ వారికి సేవలు అందించడంలో నిత్యం మండల శాఖ కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మణి సుబ్బు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాస మండల అధ్యక్షులు ఈ శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి యం.పి నరసింహులు ట్రెజరర్ పవన్ కుమార్ తదితరులు. తదితరులు పాల్గొన్నారు.

## బల్లిపర్రు గురుకుల పాఠశాలలో వ్యవసాయం పై విద్యార్థులకు అవగాహన



**పెడన జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం స్కూల్ బల్లిపర్రు నందు 8,9 చదువుతున్న విద్యార్థినులకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నాడు భూ ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు.భాగంగా భూ ఆరోగ్యం భూమిలో ఉండే నత్రజని భాస్వరం పొటాష్ జింక్ ఐరన్ కాపరు మాంగనీస్ మెగ్నీషియం క్యాల్షియం సల్ఫర్ న్యూట్రియన్స్ యొక్క ప్రాముఖ్యత వివరించారు.రైతులకు పచ్చిరొట్ట పైరులు వేసుకోవడం వల్ల వచ్చే లాభాలు గురించితెలిపారు.ప్రాక్టికల్ గా మట్టి నమూనా ఎట్లా తీయాలో విద్యార్థినులకు డెమో చూపించడం జరిగినది. ఈ కార్యక్రమశీ లో జిల్లా వనరుల కేంద్రం కృష్ణాజిల్లా నుంచి సహాయ వ్యవసాయ సంచాలకులు కే .శ్రీనివాసరావు వ్యవసాయ అధికారి పద్మజా పెడన మండల వ్యవసాయ అధికారి ఎస్ జెన్నీ గ్రామ వ్యవసాయ సహాయకులు మహాలక్ష్మి, స్వరూప స్కూల్ ప్రిన్సిపాల్ రూతమ్మ సైన్స్ టీచర్ సురేఖ విద్యార్థినిలు పాల్గొన్నారు

## ఐదేళ్ల పాలనలో అధికారంలో ఉండి మున్సిపాలిటీ లో అభివృద్ధికి తిరోగతి

**ఆత్మకూరు జూలై 13 (వార్త ప్రభ)** ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం నాయకుడు తుమ్మల,చంద్రారెడ్డి పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉండి ఐదేళ్లు మున్సిపాలిటీని అభివృద్ధికి దూరం పెట్టిన మహా ఘనులు మీరు తెలుగుదేశం పార్టీ అభివృద్ధి లేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. సోమశిల ప్రాజెక్టు నుండి 45 కిలోమీటర్ల పైప్ లైన్ వాటర్ స్కీం పైపును వైసీపీ నాయకుడు రవీంద్రారెడ్డి ఆర్ అండ్ బి రోడ్డు ఆక్రమించుకొని బోరువేస్తూ ఆ పైపును ధ్వంసం చేసిన ఘనత మీ నాయకుడు కదా! ఈరోజు ఇన్ని సమస్యలు ఆత్మకూరు త్రాగునీటి సమస్య ఏర్పడింది.ఆ పైప్ లైన్ జాయింట్ చేసేందుకు చెన్నైనగరం నుండి తెప్పించి రెండు రోజులకి పూర్తి చేశామని ప్రాజెక్టు వద్ద నుండి మోటర్లు మరలా తిరిగి ఆన్ చేసిన వెంటనే ఇబ్బందిగా మారిందని దీని దృష్టిలో పెట్టుకొని ఆత్మకూరు పట్టణంలోని అన్ని వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్న విషయాన్ని తెలియదా మీకు పట్టణంలో మంగళవారం నుండి యధావిధిగా ప్రతిరోజు త్రాగునీటికి ఎలాంటి సమస్య లేకుండా ప్రజలకు అందిస్తామని తెలుగుదేశం పట్టణ నాయకుడు చంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. ఐదు సంవత్సరాలు మున్సిపాలిటీ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో ఉండి కనీసం ఒక్క రోడ్డు కూడా వేయలేదు మీరు తెలుగుదేశం హయాంలోనే ఈరోజు ప్రతి



వార్డులో సిమెంట్ రోడ్ సిమెంట్ రోడ్ల డ్రైనేజీలు పనులు పూర్తి అవుతున్నాయని గొడ్డలి పార్టీకి ఇవి కనిపించలేదా సమస్య ఉంటే సమస్య మీద మాట్లాడాలి అభివృద్ధి గురించి మాట్లాడటం ఏమిటి ఆశ్చర్యంగా ఉంది ఈ సమావేశంలో సిండికేట్ ఫార్మల్ సొసైటీ చైర్మన్ పరిటాల సత్యం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సర్దార్ ఆత్మకూరు రూలర్స్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుంకర పెంచలయ్య మున్సిపల్ మాజీ వార్డ్ కౌన్సిలర్స్ సురా భాస్కర్ రెడ్డి గౌస్ పాషా శివారెడ్డిలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డా.అనిత



**కాకినాడ : జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డా.కె.అనిత బదిలీ అయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా స్థాయి అధికారులను బదిలీలు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.ఇప్పటి వరకు డిఎంహెచ్‌ఓగా బాధ్యతలు నిర్వహించిన డా.నరసింహ నాయక్ విజయవాడ బదిలీ అయ్యారు. డా.అనిత శ్రీకాకుళం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో సీఎస్ ఆర్ఎంవోగా విధులు నిర్వహిస్తు బదిలీపై కాకినాడ జిల్లాకు వస్తూన్నారు.గతంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా, కాకినాడ జీజీహెచ్ సీఎస్ ఆర్ఎంవోగా,రంగారాయ వైద్య కళాశాల ప్రొఫెసర్ గా, సివిల్ సర్జన్ గా విధులు నిర్వహించారు.త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నానని ఆమె తెలిపారు.



: గన్నవరం మండలం బి బి గూడెం గ్రామానికి చెందిన సామల పెద్ద వెంకటేశ్వరరావు గారు ఇటీవలే మరణించగా నేడు వారి చిత్రపటానికి పూలమాలవేసి కుటుంబ సభ్యులను పరామర్శించిన డా. వల్లభనేని వంశీ- వార్తా ప్రభ, గన్నవరం

## వడ్డేపల్లి ఎంక్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే కృష్ణారావు...



**కూకట్ పల్లి,జూలై13(వార్తాప్రభ):**కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానంద నగర్ లో గల వడ్డేపల్లి ఎంక్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను మాధవరం కృష్ణారావు అభినందించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షులు పిఎస్ ఆర్కే భగవాన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన కార్యాలయాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణిస్తూ సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న పీఎస్ఆర్కే భగవాన్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం అభినందనీయం అన్నారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న ఆయన కు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కృష్ణారావు సూచించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తేనేటి విందులో కృష్ణారావుతోపాటు మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, వడ్డేపల్లి ఎన్క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకుడు "పడమట"వెంకటేశ్వరరావు మృతి



**చెరుకుపల్లి మండలం జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కామినేనిపాలెం గ్రామానికి చెందిన పడమట వెంకటేశ్వర రావు 63సం" ఊపిరితిత్తుల అనారోగ్యంతో గుంటూరు హాస్పిటల్ లో చికిత్స పొందుతూ చనిపోయారు వీరికి ఒక కుమారుడు ఒక కుమార్తె భార్య ఉన్నారు. వీరు భట్టిప్రోలు మండలం తాతవారిపాలెం లో జన్మించి అనియుత విద్య ఇన్స్ట్రక్టర్ గా నిరక్షరాస్యతపై విశేషమైన కృషిచేసి నిరక్షరాసులైన పెద్దలను అక్షరాసులుగా తీర్చిదిద్దారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆవిర్భావం నుండి హిందూ ధర్మ సేవకుడిగా అనేక బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం బాపట్ల జిల్లా పరియోజన ప్రముఖ్ బాధ్యతలలో ఉన్నారు. సమాజ సేవలో హిందూ ధర్మ సేవలో వారు విశేషమైన కృషి చేశారు వారి మరణం సమాజానికి తీరని లోటు అని పలువురు విచారం వ్యక్తం చేశారు. కామినేని వారి పాలెం వారి స్వగృహంలో వారి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళులు అర్పించారు. వీరికి నివాళు లర్పించిన వారిలో పొన్నపల్లి సత్యనారాయణ జంజనం హేమశంకరరావు పేరం కోటేశ్వరరావు వేల్పూరు శ్రీనివాసరావు చింతల మురళీకృష్ణ జంగం శ్యాంప్రసాద్ శొంఠి బాబురావు అమర్తలూరి నాగరాజు తదితరులు ఉన్నారు.

## అర్జీల పరిష్కారంలో 6వ స్థానంలో గన్నవరం



**గన్నవరం : జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రభుత్వానికి వచ్చిన అర్జీల పరిష్కారంలో గన్నవరం నియోజకవర్గం రాష్ట్ర వ్యాప్తంగా ఆరో స్థానంలో నిలిచింది. పిజిఆర్ ఎస్ ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుండి ఐ.వి. ఆర్.ఎస్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం సేకరించింది. ఈ ఫీడ్బ్యాక్ ద్వారా వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి నియోజకవర్గాల వారీగా ర్యాంకింగ్ ఇచ్చారు. ఈ మేరకు వచ్చిన ఫలితాలను చూస్తే ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నేతృత్వంలో గన్నవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ అధికారులు అర్జీల పరిష్కారంలో ముందంజలో ఉన్నారు. అర్జీల పరిష్కారంలో ఐదు అంశాలలో ప్రజల నుండి ఫీడ్బ్యాక్ ను ప్రభుత్వం సేకరించగా 3.52 శాతం గన్నవరం నియోజకవర్గ ప్రజల నుండి సంతృప్తి వ్యక్తం అయింది. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆరవస్థానం సాధించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీకాకుళం మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ రాణించిన రాజాం డి.ఎ.ఏ విద్యార్థులు




**రాజాం, జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈ నెల 11, 12 తేదీల్లో శ్రీకాకుళం మున్సిపల్ స్టేడియం నిర్వహించిన బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి పోటీలలో రాజాం స్థానికి జి.యమ్. ఆర్. వరలక్ష్మి డి.వి.వి పాఠశాల విద్యార్థులు హె. నందన్ - 5 వ తరగత మరియు బి.నిఖిల్ 6వ తరగతి అండర్-11 కేటగిరిలో డబుల్స్ నందు పాల్గొని రన్నర్స్ గా నిలిచారు.ఈ విజయం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ మరియు జి.ఎం.ఆర్.మేనేజ్మెంట్ విద్యార్థులను మరియు వ్యాయామ ఉపాధ్యాయుల వారిని అభినందించారు.

## అదృశ్యమైన బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



**మైలవరం జులై 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**: ఎన్టీఆర్ జిల్లా మండల పరిధిలోని ఒక గ్రామంలో ఈ నెల 12వ తేదీ రాత్రి ఒక మైనర్ బాలిక (16) తన బంధువుల ఇంటి నుంచి అదృశ్యమైందని బాలిక కుటుంబ సభ్యులు మైలవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.తక్షణమే మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ సుధాకర్ ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగి, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా దృశ్యాలను నిశితంగా విశ్లేషించాయి.సాంకేతిక ఆధారాలు మరియు నిఘా బృందాల సమన్వయంతో బాలిక వరంగల్ ప్రాంతంలో ఉన్నట్లు కొద్ది గంటల వ్యవధిలోనే గుర్తించడం విశేషం.ఆ బాలికను పోలీసులు క్షేమంగా పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఫిర్యాదు అందిన నాటి నుంచి బాలికను క్షేమంగా గుర్తించే వరకు పోలీసు బృందాలు చూపిన అప్రమత్తత, వేగవంతమైన సాంకేతిక పరిశోధన మరియు సమన్వయంతో కూడిన కృషి ప్రశంసనీయం.కేసు దర్యాప్తులో అత్యంత ప్రతిభ చూపిన కానిస్టేబుల్ ప్రదీప్ ను మరియు పీసీ మనోహర్ జి.కొండూరు లను మైలవరం ఇంచార్జ్ ఏసీపీ రామచంద్రావు ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.కిషోర్ బాబు తో కలిసి నగదు బహుమతి అందచేశారు.

**పిల్లల భద్రత పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి :ఏసీపి రామచంద్రరావు** పిల్లల భద్రత పట్ల తల్లిదండ్రులు, వారి సంరక్షకులు మరింత అప్రమత్తంగా ఉండాలని మైలవరం ఇంచార్జ్ ఏ సీ పి రామచంద్రరావు విజ్ఞప్తి చేశారు.మైనర్ పిల్లలు ముఖ్యంగా బాలికలు ఒంటరిగా ఉన్నప్పుడు వారి కదలికలపై నిరంతర పర్యవేక్షణ ఉంచడం, స్నేహితులు లేదా అపరిచితులతో సంబంధాల పట్ల అవగాహన కలిగించడం, మొబైల్ ఫోన్ వినియోగంపై నిఘా ఉంచడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఏదైనా అనుమానాస్పద పరిస్థితి తలెత్తినా, పిల్లలు కనిపించకుండా పోయిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 కు సమాచారం అందించాలన్నారు. నగదు బహుమతి అందజేత కార్యక్రమంలో మైలవరం ఎస్ఐ సుధాకర్, జి.కొండూరు ఎస్ ఐ సతీష్ కుమార్, మహిళా ఎస్ఐ గిరిజామణి పాల్గొన్నారు.

# తెలుగు భాషాభివృద్ధికి "రావూరి" సేవలు స్ఫూర్తిదాయకం



**గుడివాడ,జూలై 13 (వార్తాప్రభ) :** తెలుగు భాషాభివృద్ధికి కీర్తిశేషులు రావూరి భరద్వాజ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని పెదపారుపూడి మండల పరిషత్ డిప్యూటీ ఎం.డి.ఓ. వంగా శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలుగు భాష వికాస సమితి ఆధ్వర్యంలో స్థానిక వీర బ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూర్ భరద్వాజ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి ఆధ్వర్యంలో ప్రతియేటా కీర్తిశేషులు రావూరి భరద్వాజ సాహితీ స్ఫూర్తి పురస్కారాన్ని రాజమండ్రి కి చెందిన ప్రముఖ రచయిత దోసరాజు శ్రీనివాసరావుకు ప్రధానం చేశారు. తెలుగు భాష వికాసమితి సమన్వయకర్త బి.ఆర్.బి ప్రసాద్, చింతలూరి సత్యనారాయణ, అభినేని వెంకటేశ్వరరావు, వల్లభాపురం కృష్ణ కిషోర్, యలమర్తి కోటేశ్వరరావు, నరహరిశెట్టి ప్రసాద్, గాదే మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేడ్ వన్ లైబ్రేరియన్ నగేష్ కు ఘనంగా అభినందనలు



**గుడివాడ,జూలై 13 (వార్తాప్రభ) :** షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రేట్ వన్ లైబ్రేరియన్ గా పని చేస్తూ గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా పదోన్నతి పై విజయనగరానికి జిల్లా కు బదిలీ అయిన ఎం.వి .డి.టి నగేష్ ను ఫ్రెండ్స్ ప్రోగ్రెసి ఫ్రంట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎఫ్ పి. ఫ్. క న్వీనర్ డి.ఆర్పి ప్రసాద్ మాట్లాడుతూ నగేష్ గ్రేడ్ వన్ గ్రంథాలయ అధికారిగా షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్ గుడివాడ వాకర్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు డి.వి. సత్యనారాయణ, లంకపల్లి లాజర్, రాజనాల గాంధీ, గ్రంథాలయ పాఠకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రజత పతకాలను కైవసం చేసుకున్న మాంటిసోరి విద్యార్థులు




**గుడివాడ,జూలై 13 (వార్తాప్రభ) :** ఈ నెల ది. 9. 7. 2026 నుండి 12. 7. 2026 వరకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కే.బి.సి.జడ్.పి బాయ్స్ హై స్కూల్ పటమట నందు జరిగిన తొమ్మిదవ యూత్ ఇంటర్ డిస్టిక్ బాస్కెట్బాల్ చాంపియన్షిప్ పోటీలలో గుడివాడకు చెందిన మాంటిసోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పాల్గొని కృష్ణ జిల్లా జట్టు తరఫున ఉత్తమ ప్రాతినిధ్యం వహించి రజత పథకాలను కైవసం చేసుకున్నారు. విద్యార్థులు పేర్లు : ఏ. శివ మరియు జి. రాకేష్ వీరమాధవ్ లు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాంటిసోరి మహిళా సంఘం కార్యవర్గ సభ్యులు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయిని గుళ్ళపల్లి పద్మావతి అభినందిస్తూ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు అయిన గోవాడ శ్రీనివాసరావు, మడక అన్వేష్ లకు మరియు పతకాలను సాధించిన విద్యార్థులకు తమ అభినందనలు తెలియజేశారు.

# శత వసంతాల కొటాయి మంటపం



**తిరువూరు,జూలై 13 (వార్తాప్రభ) :** తిరువూరు జైబావి సెంటర్లో 1926 లో యశోద వరమ్మ నిర్మించిన కొటాయి మంటపం శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె మనవడు యశోద బసవేశ్వర రావు ఆధునికీకరించారు. ఏటా జరిగే తిరువూరు తిరునాళ్లలో ఈ కొటాయి మంటపం నుండే వెంకటాచలస్వామి కి ఎదురుకోలు ఉత్సవం నిర్వహిస్తున్నారు. మంటపం చుట్టూ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేసి విద్యుదీకరణ చేపట్టారు.

# అర్జీల పరిష్కారంలో రాష్ట్రంలో 6వ స్థానంలో గన్నవరం



**గన్నవరం,జూలై 13 (వార్తాప్రభ) :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పి జి ఆర్ ఎస్) ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంలో గన్నవరం నియోజకవర్గం రాష్ట్రవ్యాప్తంగా ఆరో స్థానాన్ని దక్కించుకుంది. ఐవీఆర్ఎస్ ( ఐ వి ఆర్ ఎస్) కాల్స్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం సేకరించిన అభిప్రాయాల ఆధారంగా నియోజకవర్గాల వారీగా ర్యాంకింగ్ ప్రకటించగా, గన్నవరం ఈ ఘనత సాధించింది. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నాయకత్వంలో ప్రభుత్వ అధికారులు ప్రజా అర్జీల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేస్తున్నారని ఈ ర్యాంకింగ్ స్పష్టం చేస్తోంది. అర్జీల పరిష్కారానికి సంబంధించిన ఐదు అంశాలపై ప్రజల నుంచి ప్రభుత్వం ఫీడ్బ్యాక్ సేకరించగా, గన్నవరం నియోజకవర్గానికి 3.52 స్కోరు లభించింది. రాష్ట్రస్థాయిలో ఆరో స్థానం సాధించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యం

● గుడివాడ నియోజకవర్గంలో తాగునీటి నాణ్యతపై ఎమ్మెల్యే రాము ప్రత్యేక సమీక్ష..



**గుడివాడ,జూలై 13 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గంలో ప్రజలందరికీ స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన సమావేశంలో గ్రామాల వారీగా నీటి నాణ్యత పరీక్షల నివేదికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే రాము సూచించారు. దీనికి అనుగుణంగా మండల పరిషత్ అధికారులు, రూరల్ వాటర్ సప్లై అధికారులు రూపొందించిన నివేదికలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న తాగు నీటి నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజారోగ్యం విషయంలో ఎలాంటి రాజీపడేది లేదనీ, క్రమం తప్పకుండా అధికారులు గ్రామాల వారీగా నీటి నాణ్యత నివేదికలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలనీ స్పష్టం చేశారు. నీటి నాణ్యతలో ఏ చిన్న లోపం ఉన్నా వెంటనే సరిచేయాలనీ, ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, నందిపేట మండలం పార్టీ ప్రెసిడెంట్ దానేటి సన్యాసి రావు, గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండల పరిషత్ అధికారులు విష్ణు ప్రసాద్, మల్లీశ్వరి, ఇమ్రాన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు రూపేష్, కిస్మత్ రాణి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు

# నెలవంక చంద్రుని వలె దినదిన అభివృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్



**విస్సన్నపేట,జూలై 13 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో రియల్ ఎస్టేట్ రంగం నెలవంక చంద్రుని వలె దినదినభివృద్ధి చెందుతూ ముందుకు వెళుతుంది అంటే ఎలాంటి అతిశయోక్తి లేదు. గతంలో రియల్ ఎస్టేట్ రంగంలో జన చైతన్య , ఉషోదయ వంటి రియల్ ఎస్టేట్స్ రంగంలో ఉండగా ప్రస్తుతం లగ్జరీ హౌసెస్ డిమాండ్ పెరుగుతూ ఉండటంతో అమరావతి రాజధాని పరిధిలో సిఆర్డిఏ చుట్టూ పలు ప్రాజెక్టులు ఊపొందుతున్నాయని చెప్పాలి. టౌన్షిప్పుల నిర్మాణానికి ప్రాధాన్యత పెరుగుతుంది. భూ సమీకరణ మౌలిక వసతులు అభివృద్ధికరణ లక్ష్యంగా గేటెడ్ కమ్యూనిటీలకే పరిమితం కాకుండా వినూత్న పద్ధతిలో ఆసుపత్రులు పాఠశాలలు వాణిజ్య సముదాయాలు అన్ని ఒకేచోట ఉండి ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్పులు వైపు ప్రజలు ఆసక్తి చూపుతూ ఉండటంతో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండేలా వెంచర్ల నమూనాలను తీర్చిదిద్దటంలో బిల్డర్లు సాంకేతికతను జోడిస్తూ వినూత్న పంథాను అవలంబిస్తున్నారు. గతంలో రెవెన్యూ పరిధిలో గ్రామపంచాయతీ,మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఏరియాలను బట్టి అనుమతులకు అగ్రికల్చర్ ల్యాండ్ కు నాలా కట్టి కమర్షియస్డ్ భూమిగా మార్చుకోవటం నిబంధనల ప్రకారం పార్కింగ్ వాటర్ ట్యాంక్ తదితరాలతో పాటు విశాలమైన రోడ్లను ఏర్పాటు చేయడం డ్రైనేజీ వ్యవస్థ విద్యుత్తు లైన్ తదితరాలను అందించడం జరిగేది. బడికి గుడికి రైల్వే స్టేషన్ కు దగ్గరగా మా వెంచర్ ఉండేదని గతంలో ప్రచారం చేసుకునేవారు అదేవిధంగా గూగుల్ మ్యాప్ బ్రోచర్లలో చూపించేవారు. ప్రస్తుతం ట్రెండు మారిన దుష్య గుడి బడి ఆసుపత్రి షాపింగ్ కాంప్లెక్స్ తదితరాలను సైతం తమ వెంచర్లో ఉండే విధంగా కొత్త సొగసులు నూతనంగా వచ్చే వెంచర్లకు పలు నిర్మాణాలు నైనానందకరంగా అలంకారంగా మారాయని సర్వత్రా వినిపిస్తుంది. అర్బన్ నెక్స్ట్ రియాల్టీ, నెక్స్ట్ క్విస్ట్, హెవెన్ లయన్ రియాల్టీ, డ్రీమ్ డెవెలెల్లింగ్ గ్రూప్, ప్లాటినం ఎస్టేట్ రియాల్టీ, గ్రా డ్యూర్ ప్రాపర్టీస్, చందన్ వ్యాలీ, రాయల్ హెవెన్ రియల్ టీ తదితర సంస్థలు అన్ని అంగులతో పాటు ఇంటీరియల్ డిజిటల్ ప్లానింగ్ తో ప్రతి గృహానికి గార్డెనింగ్ స్విమ్మింగ్ పూల్స్,ఫల పుష్ప ఔషధ మొక్కలను అందుబాటులో సోలార్ తో నిర్మాణాలు జరగటం సొంత ఇంటి కలల సహకారానికి కలలు కానె నేటి యువతకు మరపురాని మధురమైన మరువలేని మహోన్నత స్వప్నాలను నిజం చేస్తూ నగ్న సత్యాలుగా కళ్ళముందు ఉంచే వెంచర్లు రెడీ కావడం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు గొప్ప వరమనే చెప్పాలి అని అనుకుంటున్నారు.

# రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలి - పెడన వైసిపి ఇన్చార్జ్ ఉప్పాల రాము...



**కృత్తివెన్ను,జూలై 13 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గంలోని పంట పొలాలకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని వైయస్సార్సీపి పెడన నియోజకవర్గ ఇన్చార్జ్ ఉప్పాల రాము డిమాండ్ చేశారు. సోమవారం బంటుమిల్లి మండలం మల్లేశ్వరం ఇరిగేషన్ కార్యాలయం వద్దకు చేరుకున్న వైసీపీ శ్రేణులు నిరసనను తెలియజేశారు. అనంతరం బంటుమిల్లి లక్ష్మీపురం ప్రధాన పంట కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ బంటుమిల్లి కృత్తివెన్ను మండలాల్లో సార్వా వరిసాగు పూర్తి స్థాయిలో ప్రారంభించి నెల రోజులు కావస్తుందని, ఈ రెండు మండలాలలో పూర్తిగా రైతులు ఎదజల్లే విధానం పైనే ఆధార పడ్డారని ఈ సమయంలో వరిపొలానికి పూర్తిస్థాయిలో నీరు అందుబాటులో ఉండాలని కానీ కాలువలలో నీరు రానీ పరిస్థితి ని చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు అన్నారు. ఈ స్థితిలో ప్రభుత్వం పులిచింతల రిజర్వాయర్లో పూర్తిస్థాయిలో నీరు ఉందని పట్టు సీమ పంపులు మొదలు పెట్టామని చెబుతున్న రైతులు సాగునీరు సకాలంలో అందజేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం సకాలంలో సాగునీరు అందజేయని కారణంగా రైతులు మరల రెండవసారి వరి నాట్లు వేసుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు సార్వాసాగు మొదట్లోనే నష్టపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని అన్నారు. అలాగే బంటుమిల్లి మండలం సాతులూరు గ్రామం వద్ద వంతెన నిర్మాణం పనులు వేసవిలో చేపట్టకుండా సాగు పనులు కాలంలో కాలువకు అడ్డుకట్ట వేసి రైతులను ఇబ్బందులకు గురి చేయడం నీటిపారుదల శాఖ పంచాయతీరాజ్ శాఖల సమన్వయ లోపం వలన దిగువ భూములకు సాగునీరు అందక ఎండిపోవడానికి కారణమైందని దుయ్యబట్టారు. బంటుమిల్లి ప్రధాన కాలువతో పాటు బంటుమిల్లి కృత్తివెన్ను మండలాల్లోని అన్ని బ్రాంచి కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేసి ఎద జల్లిన పొలాలు దెబ్బతినకుండా రైతులను ఆదుకోవాలని అలాగే నారుమళ్ళను కాపాడి నాట్లు సజావుగా సాగేందుకు నీటిపారుదల శాఖ నుంచి పూర్తి బాధ్యత తీసుకోవాలని వైయస్సార్సీపి డిమాండ్ చేస్తుందన్నారు. సార్వా పంటను కాపాడటంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ప్రత్యక్ష ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాలకు సంబంధించిన వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు కార్యకర్తలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# ఎంఈఓ 1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలి

● ఎంఈఓ -1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం విజ్ఞప్తి



**విజయవాడ,జూలై 13 (వార్తాప్రభ) :** విద్యా శాఖలో పనిచేస్తున్న మండల విద్యాశాఖ అధికారి -1 లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విద్యా శాఖ మంత్రికి ప్రాతినిధ్యం చేసిన లేఖను ఆయన పత్రికలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా సామల సింహాచలం మీడియాతో మాట్లాడుతూ మండలంలో పనిచేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న దాదాపు 200 మంది ఉపాధ్యాయులకు డీడీవో గా ఉన్న ఎంఈఓ -1 లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. పరిమిత స్థాయిలో ఉపాధ్యాయులున్న హై స్కూల్ హెచ్ఎం లకు సైతం సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించిన ప్రభుత్వం మండల విద్యాశాఖకు హెడ్ గా ఉన్న గెజిటెడ్ ఎంఈఓ-1 లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించకపోవడం వలన ఈ సమస్య తమ ఆత్మ గౌరవ సమస్య గా మారిందని సామల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లామని, మంత్రి సానుకూలంగా స్పందించినప్పటికీ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మాత్రం విడుదల కాలేదన్నారు. అదేవిధంగా, ఎంఈఓ1 లకు జాబ్ చార్ట్ కు భిన్నంగా కొన్ని జిల్లాల్లో డీఈవోలు విధులు కేటాయిస్తున్నందున ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎంఈఓ -1 ల సమస్యలపై విద్యామంత్రి చొరవ తీసుకొని పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి బుక్కా రవి నాయక్ లు విజ్ఞప్తి చేశారు.

# ఇంకెంతకాలం ఈ ఎదురు చూపులు?

● మేము అద్దెలు కట్టలేం బాబూజీ! ● సిపిఎం నాగరాజు







**విస్సన్నపేట,జూలై 13 (వార్తాప్రభ) :** అధికారులు తలుచుకుంటే ఏదైనా జరుగుతోంది అనే నమ్మకం ఉన్నదని జగనన్న కాలనీ పేరున గత ప్రభుత్వంలో ఇచ్చిన నివేశన స్థలాలు ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నదని సిపిఎం నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో స్థలాలు ఇచ్చి మౌలిక వసతులు మరియు నిర్మాణాలు మరిచారని ప్రస్తుత ప్రభుత్వం హయాంలో వాటి ఊసే లేదని ప్రభుత్వం మారితే మూడు సెట్లు స్థలాన్ని ఇవ్వడం జరుగుతుందని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారని ఎందరో ఆడపడుచులు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన చెప్పారు. నాటి ప్రభుత్వం ఇచ్చిన సెంట్ నర భూమి డబల్ అవుతుందని అందరూ ఆశించారని ఆనాటి నుండి ఈనాటి వరకు ఎలాంటి మార్పు లేకపోగ ప్రస్తుతం ఉన్న స్థలానికి హద్దులుగా ఉన్న రాళ్లు రాళ్లు కనబడటం లేదని పిచ్చి తుమ్మ అడవిగా జగనన్న కాలనీ మారిందన్నారు. సోమవారం ఉదయం లబ్ధిదారులు కత్తులు, గొడ్డలితో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చెట్లు తీసివేయడానికి శ్రీకారం చుట్టారు. మౌలిక వసతులు కల్పిస్తే ఇంటి నిర్మాణాలు చేసుకుంటామని అధికారులు కరుణ చూపాలని కోరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సిపిఎం జ్ఞాన రత్నం మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా స్థలం పొందిన ప్రతి ఆడపడుచు కలలు కనడమే సరిపోయిందని ఆ కలలు సహకారం మాత్రం కాలేదని ఇంటి అద్దెలు మాత్రం పెరుగుతున్నాయని గ్రామపంచాయతీ మండల ప్రజా పరిషత్ జడ్పిటిసి ఎన్నికల నాటికి ఇంటి నిర్మాణాలకు చేయూత ఇవ్వాలని లబ్ధిదారుల తరఫున ఆయన డిమాండ్ చేశారు.

# రైతులకి నూతన వస్త్రాలు, అన్నదాన కార్యక్రమం..



**గుడివాడ,జూలై 13 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలంలో నాట్లు వేస్తున్న రైతులకు నూతన వస్త్రాలు, మరియు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన గుడివాడ పట్టణ సమాజ సేవకుడు డాక్టర్ మాచర్ల రామకృష్ణ (ఆర్కే).. ఈ సందర్భంగా ఆర్కే మాట్లాడుతూ, సమాజమే దేవాలయంగా భావిస్తూ నా జన్మదిన సందర్భంగా రోజు అన్నం పెట్టే అన్నదాతకు ఒక్కరోజైనా అన్నం పెట్టాలని ఆలోచనతో వ్యవసాయంలో నాట్లు వేస్తున్న రైతులతో కలిసి వారితో పనిచేసి, వారికి నూతన వస్త్రాలు, మరియు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషం కరంగా ఉందని, అదేవిధంగా మంచి వర్షాలతో, వ్యవసాయం అత్యధిక దిగుబడి ఇచ్చి, రైతు కళ్ళల్లో ఆనందం చూడాలని ఆ భగవంతున్ని కోరుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లంకా రాంబాబు, రాంప్రసాద్, గాదె చరణ్, రైతులు, మరియు ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

# సర్కిల్ పేట లో శివునికి విశేష అభిషేకం



**మచిలీపట్నం,జూలై 13 (వార్తాప్రభ) :** పట్టణంలోని సర్కిల్ పేట సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానం నందు అఖిలభారత అయ్యప్ప సేవ సమితి విశ్వ హిందూ పరిషద్ ఆలయ కమిటీ కలిసి మాసశివ రాత్రి సందర్భంగా శివునికి సోమవారం నాడు విశేష అభిషేకములు జరిగినవి. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ మేయర్ మోటమర్రి బాబా ప్రసాద్ వాసు వెంకట ఎస్ పి బాబు ఆలయధర్మకర్త జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

# పెరికేడు ముక్తేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ఏకాదశ రుద్రాభిషేకం, అన్నసమారాధన



**హనుమాన్ జంక్షన్,జూలై 13 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం పెరికేడు గ్రామంలోని ముక్తికాంతా సమేత శ్రీ ముక్తేశ్వరస్వామి ఆలయం శ్రీ పంచాయతన క్షేత్రంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకులు కుందుర్తి సీతారామయ్య, శ్యాం, మహేష్ ఆధ్వర్యంలో వేదోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త, విశ్వహిందూ పరిషత్ జాతీయ సభ్యుడు పుట్టగుంట సతీష్ కుమార్ స్వామివారిని దర్శించుకోగా, దేవాలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆయనకు సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# శ్రీ వేంకటేశ్వరుని దర్శనానికి భక్తజన కోలాహలం....





**గుడ్లవల్లేరు,జూలై 13 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తండోపతండాలుగా దర్శించుకునేసరికి ఆ దేవస్థాన ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరిగిందని నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా క్యూలైనుల్లో అడుగడుగునా తాగునీరు వంటి కనీస వసతుల్ని నిర్వాహకులు బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు ఏర్పాటు చేశారు.

# మూన్నాళ్ళ ముచ్చటే..!

● రెండు నెలలకే దెబ్బతిన్న జి.కొండూరు- మునగపాడు గ్రామాల మధ్య బైపాస్ రహదారి
● నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ కరువు ● బీటి రహదారి నాణ్యతలో డొల్ల




**రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నాలుగు కాలాలపాటు ఉండాల్సిన ఆ రహదారి మూన్నాళ్ళ ముచ్చటే...అన్నట్లుంది.నాసిరకం పదార్థాల వాడకం, సరైన నిర్వహణ లేకపోవడం వల్ల వేసిన కొద్ది రోజులకే రోడ్లు గుంతలమయం గా మారింది.రోడ్డు భవనాల శాఖ అధికారుల పర్యవేక్షణలో లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టాను సారంగా పనులు చేపట్టినట్లు స్థానికులు చెబు తున్నారు. వివరాలలోకి వెళితే....**

**జి.కొండూరు,జూలై 13 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కొండూరు శివారు గెయిల్ కంపెనీ నుంచి గడ్డమణుగు ఎస్సీ కాలనీ మీదుగా మునగపాడు గ్రామం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర విజయవాడ డివిజన్ పరిధిలో ని ఆర్ అండ్ బీ రహదారిని రూ.90 లక్షలతో ఇటీ వల అభివృద్ధి చేశారు.తారురోడ్డు వేసి మార్జిన్ లకు బెరమ్స్ వేయ కుండా వదిలేశారు. రోడ్డు అడుగడుగునా కుంగిపోయి గుంతలు ఏర్పడడంతో పాటు అంచులు పూర్తిగా విరిగి పోయి రహదారి ధ్వంసమైపోతోంది. అధికారుల పర్యవేక్షణలేకనే ఈ రోడ్డు అధ్వానంగా నిర్మించా రని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నా రు.మరోవైపు ఈ బీటి రోడ్డు సామర్థ్యానికి మించిన బరువుతో లారీలు తిరగడంతో తారు పొరలు దెబ్బతిని రోడ్డు అడుగుభాగం బలహీనపడి గుంతలు ఏర్పడుతున్నాయి.రోడ్డు పొరల మందం తక్కువగా ఉండటం, వేడి సరిగ్గా లేని మిశ్రమాన్ని వేయడం వల్ల రోడ్డు మన్నిక కోల్పోతుందని వాహనదారులు అంటున్నారు. అధి కారులు వెంటనే స్పందించి మార్జిన్లకు బెరమ్స్ వేయడంతో పాటు గొయ్యిలు పడిన ప్రదేశంలో మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



# ఎరువులు అక్రమ రవాణా, కృత్రిమ కొరత పై కఠిన చర్యలు

● జిల్లాలో యూరియా కొరత లేదు -- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు ● ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా పారదర్శకంగా ఎరువుల పంపిణీ ● అవసరానికి మించి ఎరువుల వినియోగం వద్దు..
● అంతర పంటలు, పంట మార్పిడి విధానాలను రైతులు పాటించాలి - జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ




**విజయవాడ,జూలై 13 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లాలో యూరియా సహా అన్ని రకాల రసాయన ఎరువులు, పురుగుమందులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ స్పష్టం చేశారు. జిల్లాలో ఎరువుల కొరతపై ఉద్దేశపూర్వకంగా వదంతులు సృష్టించడం, అక్రమ రవాణాకు పాల్పడడం లేదా కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ జిల్లాలో ఎరువుల లభ్యత, పంపిణీ విధానం, రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను పూర్తిగా పారదర్శకంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తన భూమి విస్తీర్ణానికి అనుగుణంగా యాప్‌లో నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల ఆధారంగా అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. మూడు విడతలుగా సాగుకు అవసరమైన ఎరువులను ఒకేసారి కాకుండా, పంటల దశలను బట్టి విడతల వారీగా రైతులు పొందే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. కేటాయించిన ఎరువులు ఆయా రైతుల పేర్లతోనే నమోదు చేయబడతాయని, అందువల్ల ఎలాంటి కొరత లేదా పంపిణీ సమస్యలు తలెత్తవని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 17,425 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జూన్ 8 నుంచి ఏపీఏఐఎంఎస్ యాప్ అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 22,616 మంది రైతులు 3,888 మెట్రిక్ టన్నుల ఎరువులను కొనుగోలు చేశారని వెల్లడించారు. సొంత భూములు కలిగిన రైతులతో పాటు కౌలు రైతులు, పోడు భూములు సాగు చేస్తున్న రైతులు, ఇతర అర్హులైన సాగుదారులకు కూడా ఎరువులు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎరువుల విక్రయంలో ధరలు, నాణ్యత లేదా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగినా సంబంధిత డీలర్లపై లైసెన్స్ రద్దు సహా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే జిల్లాలోని ప్రతి ఎరువుల విక్రయ కేంద్రంలో రైతుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక ఫోన్ నంబర్లను ప్రదర్శించడం జరిగిందని, సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక సేవలను రైతులకు మరింత చేరువ చేయడానికి కలెక్టరేట్ స్థాయిలో ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు లేదా ప్రజలు వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణ, ఎరువుల పంపిణీ, సాంకేతిక సమాచారం లేదా ఇతర వ్యవసాయ సంబంధిత వివరాల కోసం 91549 70454 నంబర్‌కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ నంబర్ ద్వారా అవసరమైన సమాచారం, సాంకేతిక సూచనలు, వ్యవసాయ సలహాలు అందించబడతాయని తెలిపారు. అధిక మోతాదులో రసాయన ఎరువుల వినియోగం వల్ల నేల సారవంతత తగ్గడమే కాకుండా పర్యావరణం, మానవ ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అందువల్ల శాస్త్రీయ సూచనల మేరకు మాత్రమే ఎరువులు వినియోగించాలని, అవసరానికి మించి వినియోగించరాదని రైతులకు సూచించారు. వ్యవసాయంలో స్థిరమైన ఉత్పాదకత సాధించాలంటే రైతులు అంతర పంటల సాగు, పంట మార్పిడి విధానాలు తప్పనిసరిగా అవలంబించాలని కలెక్టర్ సూచించారు. ఈ విధానాల ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఉత్పత్తి వ్యయం తగ్గి, రైతులకు దీర్ఘకాలికంగా లాభాలు చేకూరుతాయని తెలిపారు. జిల్లాలో ఎరువుల సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, రైతులకు అవసరమైన ప్రతి మెట్రిక్ టన్ను ఎరువు సమయానికి అందేలా అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డిఎంఎఫ్ విజయ కుమారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి పి.బాలాజీ కుమార్ పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానం అమలుపై పి.ఆర్.టి.యు హర్షం - రాష్ట్ర అధ్యక్షులు మర్రి ప్రభాకర్



**పెనుగంచిప్రోలు, జూలై 13 (వార్తాప్రభ) :** 2003 డి.యస్.సి ద్వారా, ఉపాధ్యాయ ఉద్యోగానికి నిర్వహించిన,వ్రాత పరీక్ష నందు అర్హత సాధించి,2004 వ సంవత్సరం0లో,ఉద్యోగంలో చేరిన, రాష్ట్రంలోని సుమారుగా పదకొండు వేల ఉపాధ్యాయులకు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకంకు, బదులుగా పాత పెన్షన్ విధానం అమలు చేసేటందుకు ఉన్న సాంకేతిక ఇబ్బందులను, తొలగించి వారందరికి పాత పెన్షన్ విధానంను అమలు చేస్తూ,నేడు జిఓ విడుదల చేసిన,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖా మంత్రివర్యులు నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి కొణిదెల.పవన్ కళ్యాణ్ ,రాష్ట్ర మంత్రి వర్గ సభ్యులందరికి ప్రోగ్రెస్సివ్ రికగ్నయిజ్డ్ టీచర్స్ యూనియన్ (పి.ఆర్.టి.యు) ఆంధ్రప్రదేశ్ పక్షాన హర్షం వ్యక్తం చేస్తూ,ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నట్లు, పెనుగంచిప్రోలులో జరిగిన కార్యక్రమంలో, పి.ఆర్.టి.యు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మర్రి.ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆవుల.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చల.సునీల్ కుమార్, కప్పల. నాగరాజు,సి. హెచ్. బ్రహ్మయ్య,మండల అధ్యక్షుడు చాట్ల.నిరంజన్,జిల్లా నాయకులు కోదాటి.నరేష్, ఎస్కె.కరీముల్లా, ఇస్లావత్.పుల్లయ్య,ఉప్పు.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు...

# కామ్రేడ్ పిడిమర్తి బాబు కు ఘనంగా నివాళ్లులు అర్పించిన సిపియం పార్టీ నాయకులు....

**పెనుగంచిప్రోలు,జూలై 13 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు తూర్పు బజారు దళిత వాడ లో సోమవారం దళిత బిడ్డ కామ్రేడ్ పిడిమర్తి బాబు ( 52) అనారోగ్యం మృతి చందంగా సీపీయం పార్టీ లో పనిచేస్తున్న బాబు కోసం జిల్లా కార్యవర్గ సభ్యులు సిపియం పార్టీ నాయకులు దార నాగేశ్వర రావు , వలభ దాసు, గురవయ్య,బి రాములు, సీ హెచ్ అరుణ కుమార్,తురక కొండలు, కర్ల చిన్నోడు, బాబు పార్థివ దేహం పై ఎర్ర జెండా ను కప్పి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లులు అర్పించిన్నారు, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎస్ సి సెల్ నాయకులు జిల్లేపల్లి ప్రభాకర రావు పాల్గొన్నారు, పిడిమర్తి బాబు కు భార్య బుల్లిమ్మ, కుమార్డు స్పందన కుమార్, కూతురు అనూష, వున్నారు, ఈ సందర్భంగా సిపియం పార్టీ నాయకులు దార నాగేశ్వర రావు గురవయ్య లు మాట్లాడుతూ బాబు 20 సంవత్సరాలు నుండి సిపియం పార్టీ లో వ్యవ సాయ కార్మిక సంఘం లో పని చేస్తున్నాడని .ఎర్ర జెండా కార్యక్రమాలు ఎక్కజారుగుతున్నా అక్కడే ప్రత్యేక్ష మావుతా



డని ప్రజా సమస్యలు పై పోరాడుతాడని నిత్యం పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాల సమస్యలు పై పార్టీ పిలుపు మేర ధర్నా లల్లో పాల్గొనే వాడని తెలిపారు.బాబు మృత దేహం వద్ద ఘనంగా నివాళ్లులు అర్పించి బాబు కుటుంబానికి సానుభూతి ని సంతాపాని తెలిపారు...

# కాశీ--ప్రయాగరాజ్--అయోధ్య యాత్ర ముగించుకొని వచ్చిన యాత్రికులకు ఘనస్వాగతం




**హిందూపురం,జూలై 13 (వార్తాప్రభ) :** కాశీ, ప్రయాగరాజ్, అయోధ్య పుణ్యక్షేత్రాల యాత్రను విజయవంతంగా ముగించుకొని హిందూపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న యాత్రికులకు ఘన స్వాగతం లభించింది. తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బి.వి. అరుణ్ కుమార్ రెడ్డి, జయనగర విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఉపాధ్యక్షురాలు పద్మా చిన్నపరెడ్డి యాత్రికులను పూలమాలలతో సాదరంగా ఆహ్వానించి అభినందించారు. సుమారు 80 మంది భక్తులు ఈ పుణ్యయాత్రలో పాల్గొనగా, యాత్ర ప్రారంభం నుంచి ముగింపు వరకు వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించినట్లు యాత్రికులు తెలిపారు. కాశీ విశ్వనాథ్, ప్రయాగరాజ్ త్రివేణి సంగమం, అయోధ్య శ్రీరామ జన్మభూమి వంటి పవిత్ర క్షేత్రాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దైవ దర్శనాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని పేర్కొన్నారు. యాత్రికుల వసతి, భోజనాలు, రవాణా తదితర అన్ని ఏర్పాట్లను సమన్వయం చేస్తూ యాత్ర విజయవంతంగా పూర్తయ్యేలా బి.వి. అరుణ్ కుమార్ రెడ్డి, పద్మా చిన్నపరెడ్డి విశేష కృషి చేశారని భక్తులు కొనియాడారు. వారి సేవాభావం వల్ల యాత్ర ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల నడుమ ముగిసిందని తెలిపారు. ఈ సందర్భంగా యాత్రికులు మాట్లాడుతూ, యాత్రను విజయవంతంగా నిర్వహించి తమకు చిరస్మరణీయ ఆధ్యాత్మిక అనుభూతిని అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పుణ్యయాత్రలను మరింత మంది భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. హిందూపురం రైల్వే స్టేషన్‌లో యాత్రికులకు ఘన స్వాగతం పలికిన సందర్భంగా కుటుంబ సభ్యులు, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# హనుమాన్ జంక్షన్‌లో ఘనంగా వాసవి జాగృతి క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**హనుమాన్ జంక్షన్,జూలై 13 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్‌లో వాసవి జాగృతి క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ వాసవి జాగృతి క్లబ్ అధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీలో అధ్యక్షురాలిగా తవ్వా సూర్యకళ, కార్యదర్శిగా పాబోలు శ్రీలక్ష్మి, కోశాధికారిగా వెచ్చా హారికతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ప్రత్యేక ఆహ్వానితుడు, ఐవీఎఫ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తవ్వా పూర్ణచంద్రరావు, పైడి సుధాకర్, కొనకళ్ల రాజశేఖర్, చామర్తి లోకనాథ్, బొమ్మిశెట్టి రామారావు, నారకిమిల్లి ప్రసాద్, వెచ్చా వెంకటేశ్వరరావు, కపిలవాయి భగవతి, ఇమ్మిడిశెట్టి భాగ్యలక్ష్మి తదితర ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం త్వరగా కోలుకోవాలని కోడూరు జనసేన ఆధ్వర్యంలో శ్రీమన్నారాయణకు ప్రత్యేక పూజలు

● దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం పూజలు నిర్వహించిన జనసేన నేతలు



**కోడూరు ,జూలై 13 (వార్తాప్రభ) :** జనసేన పార్టీ అధినేత , ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని కోరుతూ కోడూరు మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉల్లిపాలెం గ్రామంలో గల అభినవ మేలుకోటుగా ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీమన్నారాయణ స్వామి దేవాలయం చుట్టూ పార్టీ నేతలు ప్రదక్షిణలు చేసి స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ చే పవన్ కళ్యాణ్ గోత్రనామాలపై అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు మరె గంగయ్య,పార్టీ జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, కోడూరు పట్టణ అధ్యక్షులు కోట రాంబాబు, కోడూరు పిఏసిఎస్ చైర్పర్సన్ పూత బోయిన కరుణ్ కుమార్, బచ్చు వెంకటేష్, కాగిత రామారావు, అప్పికట్ల వినోద్, సనక జగన్, గుడివాక జనార్ధన్, పరిసే వెంకటేశ్వరరావు, పూత బోయనవెంకటేశ్వరరావు, లంకేరవి,అడుసు మిల్లు రాము, పుషడుపు భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు

# విజయవాడలో ఏపీ స్టేట్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ సాధించిన చింకా వీర్రాజు యాదవ్

● బ్రాంచ్ ప్రెస్ డెడ్‌లిఫ్ట్‌లో 2 గోల్డ్‌లు సాధించిన చింకా వీర్రాజు యాదవ్




**విజయవాడ,జూలై 13 (వార్తాప్రభ) :** అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన 3వ ఏపీ స్టేట్ జూనియర్ మెన్ కేటగిరీ బెంచ్ ప్రెస్ & డెడ్ లిఫ్ట్ ఛాంపియన్‌షిప్ జూలై 11, 12 తేదీల్లో విజయవాడలోని ఎస్ టి వి ఆర్ ఎం సి హై స్కూల్లో ఘనంగా జరిగింది. ఈ పోటీల్లో విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్ బీటెక్ 3వ సంవత్సరం చదువుతున్న ఐటీ విద్యార్థి అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణ రావు కుమారుడు చింకా వీర్రాజు యాదవ్ అదరగొట్టాడు. బెంచ్ ప్రెస్ 100 కిలోలు మరియు డెడ్‌లిఫ్ట్ 215 కిలోలు ఎత్తి రెండు విభాగాల్లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించి రాష్ట్ర స్థాయిలో రికార్డు సృష్టించాడు. ఈ సందర్భంగా చింకా వీర్రాజు యాదవ్ ను గోల్డ్ మెడల్ తో పాటు ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. పలువురు విద్యా వైద్య రాజకీయ ప్రముఖులు వీర్రాజు యాదవను అభినందించారు. ఒకేసారి రెండు గోల్డ్ మెడల్ సాధించి అరుదైన రికార్డు సాధించిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణ రావు కుమారుడు చింకా వీర్రాజుకు విజయవాడలోని పలువురు విద్యావేత్తలు వైద్య రాజకీయ పలు రంగాలకు చెందిన ప్రముఖులు అభినందనలు తెలిపారు

# జిల్లా కలెక్టరును మర్యాదపూర్వకంగా కలిసిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండ్ రామ్మోహన్ రావు

**కాకినాడ,జూలై 13 (వార్తాప్రభ) :** ప్రొహిబిషన్ ఎ ఎక్సైజ్ శాఖలో కాకినాడ నార్త్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న కె. రామ్మోహన్ రావు పదోన్నతి పై కాకినాడ జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంటుగా నియమితులైన సందర్భంగా సోమవారం ఆయన కాకినాడ కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.



# మద్యం సేవించి వాహనాలు నడపవద్దు- కోడూరు ఎస్సై చాణిక్య...

**కోడూరు,జూలై 13 (వార్తాప్రభ) :** మద్యం సేవించి వాహనదారులు తమ వాహనాలు నడపవద్దని కోడూరు ఎస్సై చాణిక్య అన్నారు. సోమవారం సాయంత్రం కోడూరు ప్రధాన సెంటర్లో, గొల్లపాలెం రోడ్డులోని బస్ స్టాప్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వానదారులు వాహనాలకు సంబంధించిన పత్రాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని మద్యం సేవించి వాహనాలు నడిపవద్దని సూచించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ ఎప్పుడు ఫోన్ లో ఉండేలా చూసుకోవాలని పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఆటో డ్రైవర్లు కూడా పరిమి తంగా ప్రయాణికులను ఎక్కించుకోవాలని, ఆటోలు ట్రాక్టర్ నడిపేట ప్పుడు లౌడ్ స్పీకర్ లు పెట్టవద్దని తెలిపారు. ఎక్కడైనా లౌడ్ స్పీకర్లు పెట్టి ఆటోలు, ట్రాక్టర్లు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. ప్రతి ఒక్కరు కూడా రహదారి భద్రత ప్రామాణాలను పాటించాలని కోరారు. వీరి వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188